J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 40 సంచిక : 38 19.2.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# పుట్టినింట అన్న - మెట్టినింట చెల్లి

## తెలుగు రాష్ట్రాలలో.. రాజకీయ సారధులుగా రాజన్న వారసులు



- పార్టీ స్థాపన దిశగా వేగంగా షర్మిల అడుగులు
- ఆందోళనలో వై.యస్ అభిమానులు
- షర్మిల ఇంటికి క్యూ కడుతున్న తెలంగాణ నేతలు, ప్రముఖులు

**ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు, పక్క రాష్ట్రాలలో సైతం రచ్చబండ టాపిక్‌గా మారిపోయిన అంశం తెలంగాణలో షర్మిలమ్మ పార్టీ. వైయస్ రాజశేఖరరెడ్డి తనయగా, ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెల్లిగా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ఇప్పుడు ఆమె తెలంగాణ రాజకీయాలలో అడుగుపెట్టింది. తన నాన్న, అన్నల రాజకీయ వారసత్వం కొనసాగించడానికి కంకణం కట్టుకుంది.**

**తా**ను పుట్టింది ఆంధ్రాలో అయినా... పెరిగింది, చదివింది, ప్రపంచ జ్ఞానం పొందిందీ అంతా తెలంగాణలోనే అంటోంది షర్మిల. అంతేకాదు... తాను కోడలిగా అడుగుపెట్టింది కూడా తెలంగాణలోనే అని, తన అత్తమామల పూర్వీకులతో పాటు తన భర్త పుట్టింది కూడా తెలంగాణలోనే కాబట్టి, మెట్టినింట్లో స్థిరపడిన తాను కూడా

10 లో



### ప్రశాంతంగా ముగిసిన..

# మూడోదశ పోలింగ్



జిల్లాలోని గూడూరు, నాయుడుపేట రెవెన్యూ డివిజన్లలోని 15 మండలాల్లో ఈనెల 17న పంచాయతి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా అధికారయంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. 15 మండలాల్లోని 273 పంచాయతీల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మొత్తం 83.15 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా చిట్టమూరు మండలంలో 87.31 శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా బాలాయపల్లి మండలంలో 82.43 శాతం, చిల్లకూరులో 84.46 శాతం, దక్కిలిలో 79.73 శాతం, దొరవారిసత్రంలో 86.85 శాతం, గూడూరులో 86.95 శాతం, కోటలో 78.01 శాతం, నాయుడుపేటలో 82.63 శాతం, ఓజిలిలో 85.15 శాతం, పెళ్ళకూరులో 87.75 శాతం, సూళ్ళూరుపేటలో 85.71 శాతం, సైదాపురంలో 78.03 శాతం, తడలో 84.07, వాకాడులో 84.42 శాతం, వెంకటగిరిలో 79.78 శాతం పోలింగ్ జరిగింది.

### మసాలా ప్యాకెట్ల మాటున..

# గుట్టుగా గుట్కా రవాణా

- 30 లక్షలు విలువజేసే సరుకు స్వాధీనం
- ఎస్ఇబి అధికారుల దాడిలో పట్టుబడిన వైనం

మసాలా ప్యాకెట్ల మాటున గుట్కా ప్యాకెట్లను భారీస్థాయిలో అక్రమ రవాణా చేస్తున్న వారిని ఎస్ఇబి అధికారులు ఓజిలి మండలంలోని రాజుపాళెం జాతీయ రహదారిపై కాపుకాసి చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 30 లక్షల రూపాయల విలువజేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల నాయుడుపేటలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఇబి జిల్లా అధికారులు బి.వెంకటేశ్వర్లు, ఇ.శ్రీనివాసరావు ఆ వివరాలను తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికారులు నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ మినీ లారీని అనుమానించి నాయుడుపేట ఎస్ఇబి సిఐ షేక్ అబ్దుల్‌జలీల్ తనిఖీ చేయగా, ఆ లారీలో 50 బస్తాల నిషేధిత గుట్కాప్యాకెట్లు ఉన్నాయని, కర్నాటక నుంచి కాకినాడలోని తారతారణి ఏజెన్సీ వారికి ఈ గుట్కాలను అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోందని, ఈ అక్రమ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. గుట్కాలతో పాటు లారీని కూడా సీజ్ చేసి, లారీ డ్రైవర్ క్లీనర్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. భారీస్థాయిలో అక్రమంగా తరలిపోతున్న గుట్కా ప్యాకెట్లను పట్టుకున్న నాయుడుపేట ఎస్ఇబి సిఐ జలీల్, ఎస్ఐ శేషమ్మలతో పాటు సిబ్బందిని జిల్లా ఎస్ఇబి అధికారులు అభినందించారు.

# ప్రకృతి సంపదను పరిరక్షించుకోవాలి

**డిఎఫ్ఓ షణ్ముఖకుమార్**

ప్రకృతి సంపదను పరిరక్షించుకోవాలని, అందుకు అటవీ అధికారులతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛంధంగా భాగస్వాములు కావాలని జిల్లా అటవీశాఖ అధికారి వైవికె షణ్ముఖకుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 15న ఆయన నెల్లూరులోని అటవీ టెరిటోరియల్ డివిజన్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతూ వేసవి సీజన్ సమీపిస్తున్నందువల్ల అటవీ వనాలు అగ్నికి ఆహుతి కాకుండా తక్షణం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మానవాళితో పాటు సకల జీవరాశుల మనుగడకు ఆధారమైన వాతావరణ సమతుల్యతలో వృక్షసంపద ఎంతో కీలకపాత్ర వహిస్తుందని, అందువల్ల అడవులు, వృక్షాలను పరిరక్షించుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. జిల్లాలోని వెలుగొండ అడవుల్లో ఉన్న సహజసిద్ధమైన ప్రకృతి సంపదను, వనరులను భగవంతుని వరప్రసాదాలుగా భావించి కాపాడుకోవాలని, ఎంతో అరుదైన ఎర్రచందనం అక్రమ రవాణాకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. అటవీ ప్రాంతాలన్నిటా కట్టుదిట్టమైన నిఘా యంత్రాంగాన్ని, భద్రతా చర్యలను తీసుకుంటున్నామన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు, అటవీ సంపద పరిరక్షణకు అన్ని విధాలా కృషిచేస్తున్నామని చెప్పారు. వేసవి కాలంలో వన్యప్రాణులు దాహార్తిని తీర్చేందుకు అటవీప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటుచేసి వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నామన్నారు.

### సముద్ర జలాలను మంచినీటిగా మార్చే..

# డీ-శాలిటేషన్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్ణయం

- 70 కోట్లతో ప్రభుత్వ ప్రతిపాదనలు
- సిఎస్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ
- త్వరలోనే పరిశీలనలు

*సముద్రపు నీటిని శుద్ధిచేసి మంచి నీటిగా మార్చి వినియోగించుకునేలా సరికొత్త ప్రక్రియకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారధ్యంలోని ప్రభుత్వం నిర్ణయించింది. గత కొంత కాలంగా ఈ ఆలోచనలున్నా వాటిని ఆచరణలోకి తెచ్చేందుకు తాజాగా ప్రభుత్వం అందుకు తగ్గ ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తోంది. రాష్ట్ర చీఫ్‌సెక్రటరీ ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు ఒక ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్ జిల్లాలోని కృష్ణపట్నంలో కానీ, లేదా విశాఖపట్నంలో కానీ ఎక్కడ దీని ఏర్పాటుకు అనువుగా ఉంటుందో పరిశీలించాలని ప్రభుత్వం ఆ కమిటీకి సూచించింది.*

సముద్ర జలాలను శుద్ధిచేసి ఆ నీటిని మంచినీరుగా మార్చి అటు తాగేందుకు, ఇటు పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు ఎంతగానో ఉపకరించే డీ-శాలిటేషన్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకు 70 కోట్ల రూపాయలతో డీ-శాలినేషన్ పైలెట్ ప్రాజెక్టును చేపట్టాలని కూడా నిర్ణయించింది. అందుకు అనువైన ప్రాంతం కృష్ణపట్నమా లేదా విశాఖపట్నమా అన్నది కూడా పరిశీలించి స్పష్టం చేయాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో నిపుణులతో ఒక ప్రత్యేక కమిటీని కూడా నియమించి అందుకు తగు మార్గదర్శకాలు జారీ చేసింది. పదిమంది సభ్యులతో ఏర్పాటైన ఈ కమిటీలో పరిశ్రమల శాఖ, పిఆర్. మునిసిపల్, జలవనరులశాఖలకు చెందిన ఉన్నతాధికారులు, పునరుత్పాదక ఇంధన శాఖ సంయుక్త కార్యదర్శితో పాటు ప్రధానమంత్రి ఆర్థికసలహామండలి సభ్యుడు కె.రాజేశ్వరరావు కూడా ఉన్నారు.

## పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

యాంత్రిక భాష్పీకరణ ద్వారా సముద్ర జలాలను ఉప్పునీటిగా మార్చడమే ఈ ప్లాంట్ లక్ష్యంగా ఉంటుంది కనుక, సముద్రపు నీటిని తాగునీటిగా మార్చి వినియోగించేందుకు డీ శాలినేషన్ సాంకేతిక పద్ధతులు బాగా ఉపయోగకరమని భావిస్తూ అందుకు తగ్గ మార్గాలను శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. భూగర్భ జలాలను వాడకుండా రాష్ట్రంలోని పలు పరిశ్రమలకు శుద్ధిచేసిన ఈ సముద్రపు జలాలను వాడుకునేవిధంగా ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన. ముఖ్యంగా థర్మల్ ప్లాంట్‌లు డీశాలినేషన్ నీటినే ఉపయోగించుకునేందుకు ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తున్నారు. డీ-శాలినేషన్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని మన రాష్ట్రంలో కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ఇజ్రాయిల్ ప్రభుత్వంతో రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలో ప్రభుత్వం గతంలోనే ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే.

### ఈతకోటకు

# ఉపరాష్ట్రపతి ప్రశంస

నెల్లూరుకు చెందిన రచయిత ఈతకోట సుబ్బారావు రచించిన 'ఆనాటి నెల్లూరోళ్ళు' పుస్తకానికి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశంసలు లభించాయి. ఈ పుస్తకం నెల్లూరు చరిత్ర గురించి తెలుసుకునేందుకు ఎంతగానో ఉపకరిస్తుందని ఆయన ఇటీవల ఓ లేఖలో పేర్కొంటూ రచయితను అభినందించారు. ప్రతి ప్రదేశానికి చరిత్ర ఉంటుందని, దానిని తెలుసుకోవాలనే ఆసక్తి చాలా మందిలో ఉంటుందని, ఆ తెలుసుకునే మార్గాలను సుగమంచేసే బాధ్యతను చక్కగా రచయిత నిర్వహించారని ఆయన ప్రశంసించారు.

### చాముండేశ్వరి అమ్మవారికి

# విశేష పూజలు

ఎంతో సుప్రసిద్ధమైన ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం చాముండేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 14న మాఘమాసం ఆదివారం ప్రశస్త్యమైన రోజు కావడంతో ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేషాభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనేక మంది భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### పెట్రోల్ ధర...

# 'వంద' దాటేసింది

అందరూ ఊహిస్తున్నట్లుగానే దేశంలో లీటరు పెట్రోల్ ధర ఈనెల 17 నాటికి అక్షరాలా వంద రూపాయలు దాటేసి తానూ సెంచరీ కొట్టేశానంటూ ఆకాశం వైపు దూసుకుపోతోంది. మొదటిసారిగా రాజస్థాన్‌లో లీటరు పెట్రోల్ ధర వంద రూపాయలా 13 పైసలకు చేరిపోవడంతో అక్కడి ప్రజలు, వాహనదారులు అయోమయంలో పడ్డారు. దేశంలో గత ఎనిమిది రోజులుగా ప్రతిరోజూ పెట్రోల్ ధర పెరుగుతూ వస్తోంది. 9వ రోజైన బుధవారం కూడా మరింతగా పెరిగింది. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాల్లో వంద రూపాయలకు చేరువగా ఉన్న పెట్రోల్ ధర ఇక రేపోమాపో వందను దాటేసి ఇంకా ముందుకు పరుగెత్తుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతేకాదు ఈ ధర రానున్న రోజుల్లో మరింతగా భగ్గుమంటుందని కూడా అందరూ ఆందోళనతో ఉన్నారు. పెట్రో ధరలు పెరిగితే ఇతర వస్తువులు, నిత్యావసర సరుకుల ధరల మీద కూడా ఆ ప్రభావం పడుతుందని, ఈ ధరలు ఎప్పుడు తగ్గుతాయో ఏమోనంటూ సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు దిగాలుపడిపోతున్నారు.

### రాష్ట్రస్థాయి కరాటేలో..

# సత్తాచాటిన నెల్లూరీయులు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో నెల్లూరీయులు తమ సత్తా చాటుకున్నారు. దేవ్ గోజ్యూర్యూ కరాటే ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 14న ఏలూరులో జరిగిన ఈ పోటీల్లో నెల్లూరు నవాబుపేటలోని కరాటే శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు అత్యద్భుత ప్రతిభతో రాణించారని, మొత్తం 12 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటే 10 మంది విద్యార్థులు ఉత్తమ పతకాలు సాధించడం తమకెంతో సంతోషం కలిగిస్తోందని కరాటే మాస్టర్ వెంకటరమణ చెప్పారు. అండర్-10 విభాగంలో ఎస్.నయన్, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, అండర్-8 విభాగంలో ఎన్.రాణి, ఎన్. హన్వేష్, జి.సంతోష్‌కుమార్, బి.మహీధర్‌రెడ్డిలు ఎంతో ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించారని ఆయన తెలిపారు. అదేవిధంగా అండర్-15 విభాగంలో ఎన్.డి శ్రీనివాసులు, ఎస్.వెంకట్‌లు ద్వితీయ స్థానం సాధించి సిల్వర్ పతకాలను సాధించుకున్నారన్నారు. అండర్-11 విభాగంలో జి.మంజిత్‌రెడ్డి, జి.సతీష్‌కుమార్ తృతీయస్థానం సాధించి పతకాలు పొందినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 16న నెల్లూరులోని కరాటే శిక్షణా కార్యాలయంలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేసి ఆ విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు శర్వాణి, ప్రదీప్‌కుమార్, వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటగిరి రామాలయానికి పూర్వ వైభవం

వెంకటగిరిలోని జీనుగలవారి వీధిలో ఉన్న పురాతన రామాలయాన్ని జీర్ణోద్ధరణ గావించి దాతలు, స్థానిక భక్తులు, ఆలయ నిర్వాహకులు ఆలయానికి పూర్వ వైభవం తీసుకువచ్చారు. దాదాపు నూరేళ్ళనాటి ఈ ఆలయం స్థానంలో నూతన రామాలయాన్ని నిర్మించి తమ భక్తిని చాటుకున్నారు. రామాలయం తిరిగి ప్రారంభం కావడంతో భక్తులంతా సంతోషిస్తున్నారు. ఈనెల 14న జరిగిన ఈ ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెంకటగిరి రాజకుటుంబీకుడు, ఎస్‌విబిసి ఛైర్మెన్ డాక్టర్ విబి సాయికృష్ణ యాచేంద్ర పాల్గొని పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి రామాలయాన్ని సందర్శించుకున్నారు.



# నయనానందకరంగా.. 'వసంత పంచమి'

- సరస్వతీదేవి ప్రార్థనలతో పులకించిన వేదిక
- టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు
- విపిఆర్ దంపతుల సౌజన్యంతో వేడుకలు

'వసంతి పంచమి' పర్వదినం సందర్భంగా నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం సరస్వతీదేవి ప్రార్థనలతో, గోవింద నామస్మరణలతో మార్మోగి పోయింది. వేలాదిమంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని కన్నులపండువగా జరిగిన పూజలను కళ్ళారా తిలకించి పులకించిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి..ఆయన సతీమణి, టిటిడి పాలకమండలి సభ్యురాలు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల సౌజన్యంతో జరిగిన ఈ వేడుకలు ఆద్యంతం అద్భుతంగా ఉండి అందరినీ భక్తిభావ సమన్వితులను చేశాయి.

## సరస్వతీ నమస్తుభ్యం..

సరస్వతీ నమస్తుభ్యం.. వరదే కామరూపిణీ... విద్యారంభం కరిష్యామి.. సిద్ధిర్భవతి మే సదా!.. అంటూ విద్యార్థులంతా ఆ చదువుల తల్లి సరస్వతీదేవిని ప్రార్థించుకుంటూ చదువుకోవడం ప్రారంభించుకోవడం ఎంతోకాలం నుంచి వస్తున్న ఆనవాయితీ. 'వసంతి పంచమి'.. అంటే చదువుల తల్లి.. ఆ సరస్వతీదేవి పుట్టినరోజు. మాఘ శుద్ధ పంచమి రోజున సరస్వతీదేవి ఆవిర్భవించిందని, ఆ రోజును 'శ్రీ పంచమి' అని, 'వసంత పంచమి' అని వ్యవహరిస్తుంటారని పురాణాలు చెప్తున్నాయి. అంతటి విశేషమైన రోజున శ్రీ సరస్వతీదేవి అమ్మవారిని ప్రార్థించి పూజలు చేయడం ఎంతో పుణ్యప్రదం. ఆరోజున అక్షరాభ్యాసం చేయడం వల్ల సరస్వతీదేవి కటాక్షం లభిస్తుంది కూడా. అంతటి ప్రాశస్త్యం ఉన్న రోజు కనుకే ఈ నెల 16వ తేది బుధవారం 'శ్రీ పంచమి' రోజున సాయంసంధ్య వేళ నెల్లూరులో ప్రముఖ దాతలు, దైవభక్తి పరాయణులైన విపిఆర్ దంపతులు నెల్లూరు నగరంలో అమ్మవారికి ఎంతో వైభవంగా వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో భారీ ఏర్పాట్లు జరిగాయి. రంగురంగుల విద్యుత్ దీపకాంతులతో అత్యద్భుతమైన వేదిక అత్యంత శోభాయమానంగా ఏర్పాటై అందరికీ నేత్రపర్వం చేసింది. ఈ సందర్భంగా వేదికపై కొలువుదీరిన శ్రీ సరస్వతి దేవి అమ్మవారికి వైభవోపేతంగా విశేష పుష్పాలంకారాలు జరిగాయి. అందుకు తగ్గట్టుగానే తిరుమల తిరుపతి దేవస్థానాల వేద పండితుల రాకతో దివ్యమైన మంత్రోచ్చటనలతో వేదిక అలరారింది. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వారు భక్తి శ్రద్ధలతో వేద మంత్రాలు పఠిస్తుండగా, వీణా వాద్యాలు వీనులవిందు చేస్తుండగా, చిన్నారుల నాట్య ప్రదర్శనలు కనువిందు చేస్తుండగా, విశాలమైన వేదిక ప్రాంగణంతో పాటు మైదానమంతా జాజ్వలమానంగా దీపకాంతులు వెల్లివిరుస్తుండగా శ్రీపంచమి వేడుకలు 'న భూతో న భవిష్యతి' అనే విధంగా అందరినీ భక్తిపరవశుల్ని చేస్తూ దేదీప్యమానంగా జరిగాయి. వచ్చిన ప్రతి భక్తునికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేమిరెడ్డి దంపతులు అన్ని ఏర్పాట్లు ఘనంగా చేశారు. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థుల సమక్షంలో సరస్వతీదేవిని పూజిస్తూ విద్యార్థులందరికీ ఆ చదువులతల్లి ఆశీస్సులందేవిధంగా ప్రార్థనలు చేశారు. ప్రతి విద్యార్థికి ఒక నోటుపుస్తకం, పెన్నుతో పాటు అమ్మవారి ఫోటోను కూడా బహుకరించారు. విపిఆర్ దంపతులతో పాటు టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు కూడా పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి టిటిడి తరపున 'గుడికో గోమాత' పథకాన్ని ప్రారంభించి గోపూజలు చేశారు. గోవులను పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లేనని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అయిదు ఆలయాలకు దానంగా ఇచ్చిన గోవులు, దూడలకు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి దంపతుల చేతుల మీదుగా వాటిని అయిదు ఆలయాలకు అందజేశారు. ఈ వేదికపై డిప్యూటి సీఎం నారాయణస్వామిని, కార్యక్రమ ఉభయకర్తలు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులను, టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి - స్వర్ణలత దంపతులు ఘనంగా సత్కరించారు. టిటిడి ఇ.ఓ జవహర్‌రెడ్డి, అదనపు ఇ.ఓ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో వేలసంఖ్యలో విచ్చేసిన విద్యార్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవింద నామస్మరణలు చేస్తూ, వేదికపై జగజ్జగీయమానంగా వెలుగొందుతున్న అమ్మవారిని ముకుళితహస్తాలతో దర్శించుకుని తరించారు.





# కళ్యాణ వైభవం...!

వెంకట్ రోహాన్ - శివాని పటేల్




గూడూరు వాస్తవ్యులు, చెన్నై నివాసి సిద్ధారెడ్డి వెంకటరంగారెడ్డి - కవితల రెండవ కుమారుడు వెంకట్ రోహాన్ - శివాని పటేల్ (శిరీష్ పటేల్ - రేష్మా పటేల్‌ల కుమార్తె)ల కళ్యాణం ఫిబ్రవరి 13వ తేదీ చెన్నైలో జరిగింది. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ దంపతులతో పాటు పలువురు రంగారెడ్డి మిత్రులు , సన్నిహితులు , ఆప్తులు పాల్గొని వధూవరులను దీవించారు. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



గత ఏడాది నవంబర్‌లో పెళ్ళైన రంగారెడ్డి పెద్దకుమారుడు వెంకట్ రోహిత్ - అంజనాక్షి దంపతులతో పాటు నవ వధూవరులు వెంకట్ రోహాన్ - శివాని పటేళ్లతో రోహిత్, రోహాన్‌ల అమ్మమ్మా తాతయ్యలు అత్తివరపు హరనాధరెడ్డి , లాలసమ్మలు.

# గత ప్రభుత్వాల వైఖరి వల్లే ఇదంతా

## - పెట్రో ధరల పెరుగుదలపై ప్రధాని మోడీ



పెట్రోలు ధర లీటరు వంద రూపాయల దాకా పెరగడానికి గత ప్రభుత్వాల వైఖరే కారణమని, ఇంధన దిగుమతులను తగ్గించడంపై వాళ్ళు దృష్టి పెట్టకపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. అయితే, తానెవరినీ విమర్శించడం లేదని, గత ప్రభుత్వాలు ఇంధన దిగుమతులు తగ్గించడంపై దృష్టిపెట్టి ఉంటే ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు ఇంత భారం పడేది కాదని చెప్పారు. ఈనెల 17న ఆయన ఢిల్లీ నుంచి ఓ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ పెట్రో ధరలు పెరగడాన్ని ప్రస్తావించారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో భారత్ పెట్రో ఉత్పత్తుల అవసరాల కోసం 85 శాతానికి పైగా దిగుమతి చేసుకుందని, గ్యాస్ అవసరాలకు 53 శాతం దిగుమతులపై ఆధారపడినట్లు ఆయన తెలిపారు. దీనిని తగ్గించేందుకు దశల వారీగా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ప్రధాని స్పష్టం చేశారు.

# మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు



మానవ తప్పిదాల వల్లనే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులకు సూచించారు. ఈ నెల 18వ తేదీ గురువారం నెల్లూరులోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో జరిగిన 32వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అజాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని, వాహనదారులందరూ ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. నెల్లూరు మున్సిపల్ కమిషనర్ దినేశ్‌కుమార్, ఉప రవాణా కమిషనర్ సుబ్బారావు, ఆర్టీసీ ఆర్ఎం శేషయ్య, ఎస్.ఇ. భరత్‌రత్న, డాక్టర్ బిందుశ్వేత, జిల్లా లారీ యజమానుల సంఘం కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ బహుమతులందజేశారు.

## 'ప్రభా'తం

# పెట్రో..గ్యాస్ భగ్గు! భగ్గు!

అసలే నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయి బతుకుబండి భారమైపోతోంది దేవుడా అని జనం లబోదిబోమంటుంటే, తాజాగా పెట్రో ధరల బాదుడు అదిరిపోతూ ఉంది. పప్పులు ఉప్పులు, బియ్యం, నూనెలు తదితర సరుకులతో పాటు చివరికి పండ్లు, కూరగాయలు, ఆకుకూరల ధరలు కూడా సామాన్య ప్రజలను అదరగొట్టేస్తున్నాయి. ఈ ధరలెప్పుడు తగ్గుతాయో, మన బతుకులెప్పుడు బాగుపడతాయో అని వాపోతున్న తరుణంలో అదును చూసి దెబ్బకొట్టినట్లు తాజాగా పెట్రోలు, డీజిలు, వంట గ్యాస్ ధరలు అదురుదెబ్బ కొట్టి బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు పడే బాధలు అన్నిన్ని కావు. గత ఏడాదంతా కరోనాతో బాధలు పడితే, ఈ కొత్త సంవత్సరమైనా కాస్తంత ఊరట కలుగుతుందేమోనమనుకుంటే జనవరి నుంచే ధరల మోత ప్రారంభమైంది. ఏ వస్తువు పట్టుకున్నా వీపు విమానం మోగేంతగా ధరలు మోత మోగిస్తున్నాయి. మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టుగా ఇప్పుడు పెట్రో ధరలు, గ్యాస్ ధరలు కోరలు చాస్తూ జనం మీద పడ్డాయి. వీటి ధాటికి తట్టుకోలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరలింతగా వేధిస్తున్నా కేంద్రం మౌనముద్రలో ఉండడం ప్రజలకు ఆవేదనను, ఆందోళనను కలిగిస్తోంది. గత వారం పదిరోజులుగా రోజూ పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. వాహనదారుల మీద నిత్యం వరుస దాడులు చేస్తూనే ఉన్నాయి. గత డిసెంబరు నెలాఖరు దాకా లీటరు 83.71 రూపాయలున్న పెట్రోల్ ధర ఒక్కసారిగా 14 రూపాయలు పెరిగింది. దీంతో దేశంలోని అనేక నగరాల్లో లీటరు పెట్రోలు ధర 97 రూపాయలు దాటుతోంది. ఈనెల 16 నాటికి హైదరాబాద్‌లో రూ.92.51, ముంబైలో 95.44, అమరావతిలో రూ. 96.80కి చేరుకుంది పెట్రోలు ధర. ఇలా అన్ని నగరాలు, అన్ని ప్రాంతాల్లో ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. రేపోమాపో పెట్రోల్ ధర వందకు చేరువ కావడమే కాక, వందకన్నా ఇంకా పెరిగినా ఆశ్చర్యం ఏమీ లేదన్నట్లుగా ఉంది పరిస్థితి. ఒక్క మంగళవారం రోజునే, అంటే ఈనెల 16న.. పెట్రోల్ ధర 30 పైసలు, డీజల్ ధర 35 పైసలకు పెరిగింది. రాజస్థాన్‌లో లీటరు పెట్రోలు ధర 99 రూపాయలా 87 పైసలకు చేరింది. ఇప్పటికే ఈనెలలో వీటి ధరలు 10సార్లు పెరగడం మరింత దారుణం. అయితే, ఇంతటితో అయిపోలేదు.. మరో వారం పదిరోజులదాకా కూడా ఇలా పెరుగుతూనే ఉంటాయి చూడండి అంటున్నారు ఆయా రంగాల్లోని అనుభవజ్ఞులు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరగడంతో దేశీయంగా ఉన్న చమురు రంగ కంపెనీలు కూడా ధరలను పెంచేస్తున్నాయని, అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్‌కు 60 డాలర్లు పెరగడంతో మనదేశంలోనూ ధరలు పెరిగిపోతున్నాయని వారు చెప్తున్నారు. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు కూడా పెట్రోల్‌పై 61 శాతం, డీజిల్‌పై 56 శాతం దాకా పన్నులు విధిస్తుండడంతో తీరా ఈ భారమంతా చివరికి ప్రజలపై పెనుభారంగా పడుతోందనేది నిపుణుల అభిప్రాయం. ప్రపంచ దేశాలు కరోనా నుంచి క్రమంగా కోలుకోవడం, ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తులు తగ్గించడం వంటి కారణాలతో ఇంధనానికి డిమాండ్ ఏర్పడి, అది అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరుగుదలకు కారణమవుతోందని వారి విశ్లేషణ. గత కొన్ని సంవత్సరాలుగా అంతర్జాతీయ మార్కెట్ ధరల ఆధారంగా చమురు సంస్థలు కూడా ధరలను పెంచుతూ వస్తున్నాయి. దీంతో పాటు గ్యాస్ ధరను కూడా పదేపదే పెంచాలనే ఆలోచనతో కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అందుకు తగ్గట్టుగానే ఈ ఏడాది జనవరి 6 నుంచి వీటి ధరలు పెరగడం ప్రారంభమైంది. ఒక్కరోజూ తగ్గుముఖం పట్టకపోగా, ప్రతిరోజూ అంతకంతకూ పెరిగిపోతూనే ఉండడంతో దేశవ్యాప్తంగా ప్రజలంతా నిత్యం సతమతమవుతూనే ఉన్నారు.

మరోవైపు వంట గ్యాస్ సిలిండర్ ధర 50 రూపాయలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. గత మూడునెలల్లోనే ఏకంగా సిలిండరు ధర 200 రూపాయలు పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇళ్లకు గ్యాస్ బుక్ చేసుకునేవారు అదనంగా ఇంకొంత చెల్లించాల్సి ఉంటుంది. దీంతో ఇలాంటి పెరగడాలన్నీ కలిపి సిలిండర్ ధర రూ. 821.50కి చేరిపోయింది. గత డిసెంబరులో రెండుసార్లు వంద రూపాయలు, జనవరిలో మరో పాతిక, ఈ ఫిబ్రవరిలో రెండుసార్లుగా 75 రూపాయలు పెంచేశారు. ఒకవైపు పెట్రోల్ ధరలు భగ్గుమంటుంటే, మరోవైపు గ్యాస్ ధరల సెగతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు. పెట్రోల్ ధరలు గత 8 రోజులుగా ఏకధాటిగా పెరుగుతూ లీటరు పెట్రోల్‌పై 2 రూపాయలకుపైగా, డీజిల్‌పై రూ. 2.41 వంతున పెరగడం, వంట గ్యాస్ ధర కూడా రెండు నెలల్లోనే 175రూపాయలు పెరగడం సామాన్యులకు పెనుభారం కాక మరేమిటి?..పెట్రోల్ ధరలు వాహనదారులను ఎడాపెడా వాయించేస్తుంటే జీవనచక్రం ఎలా తిరగాలి?.. చమురు సంస్థలు, సెస్సుల పేరుతో జరుగుతున్న వడ్డింపులు అన్నీ కలిసి సామాన్యుల జేబులు ఖాళీ చేసేస్తుంటే ఎలా బతకాలి?..అంటూ పేద, మధ్యతరగతి ప్రజలు ఆవేదనలో మునిగిపోతున్నారు. ఇదిలాగే కొనసాగితే ఇంకొద్ది రోజుల్లోనే లీటరు పెట్రోలు ధర అక్షరాల వంద రూపాయలు దాటిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై దృష్టిపెట్టి వీటి ధరలను బాగా తగ్గించకుంటే సామాన్యుల జీవన పరిస్థితి, వాహన దారుల పరిస్థితి మరింత అయోమయంగా మారిపోతుంది. ప్రభుత్వాలు, పాలకులు తక్షణం మేలుకొని ఈ ధరలను ఆకాశం నుంచి నేలమీదికి దింపి సామాన్యుల బతుకు జీవనం సాఫీగా జరిగేలా చూడాల్సి ఉంది.

> రోజురోజుకు పెట్రోల్ డీజిల్ ధరలు అమాంతం పెరిగిపోతుండడం దారుణం. త్వరలోనే లీటరు పెట్రోలు ధర వందకు పైగానే పెరిగిపోతుందేమోనని ప్రజలు దిగాలుపడిపోతున్నారు. ఈ ధరల ప్రభావం మిగిలిన అన్నిరకాల వస్తువులపై కూడా పడి సామాన్యుల బతుకుజీవనం మరింత దయనీయంగా మారుతుంది. మరోవైపు వంట గ్యాస్ ధర కూడా భారీగా పెరిగిపోతోంది. వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటి ధరలపై దృష్టిపెట్టి వీటి ధరలను నియంత్రించడమే కాక, అన్ని రకాల వస్తువుల ధరలను కూడా బాగా తగ్గించకుంటే సామాన్యప్రజలు, వాహనదారుల పరిస్థితి మరింత అయోమయంగా.. దయనీయంగా మారిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



## ముగ్గురు చిన్నారులను...
# మింగేసిన చెముడుగుంట చెరువు



- ఆడుకుంటామని వెళ్ళి.. విగతజీవులయ్యారు
- బిడ్డల మృతదేహాలను చూసి కుప్పకూలిపోయిన తల్లిదండ్రులు

**• బుజబుజనెల్లూరులో విషాదం**

ఆడుకునేందుకు వెళ్ళిన ఆ ముగ్గురు చిన్నారులూ చివరికి విగతజీవులుగా కనిపించడంతో వారి తల్లిదండ్రుల రోదన హృదయ విదారకంగా ఉంది. ఎవరూ ఊహించని రీతిలో బిడ్డలను కోల్పోయిన వారి బాధ వర్ణనాతీతంగా ఉంది. చెముడుగుంట చెరువులో 15 అడుగుల లోతున్న గుంతలోంచి ఆ పిల్లల మృతదేహాలను వెలికితీయడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఈ విషాద సంఘటన చెముడుగుంటలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బుజబుజనెల్లూరులోని సమతానగర్‌కు చెందిన షేక్ అలీం, భగత్‌సింగ్ కాలనీకి చెందిన మోపూరు రాజేష్, వికలాంగుల కాలనీకి చెందిన పార్లపల్లి వెంకటసాయి ఈ ముగ్గురూ మంచి స్నేహితులు. అందరూ పద్నాలుగేళ్ల లోపువారే. బుజబుజనెల్లూరులోని ఉన్నత పాఠశాలలో వీరంతా ఏడు, ఎనిమిది తరగతులు చదువుకుంటున్నారు. ఆదివారం సాయంత్రం ఆడుకుని వస్తామని ఇళ్లలో తల్లిదండ్రులకు హుషారుగా చెప్పి సైకిళ్ళు తీసుకుని సంతోషంగా బయలుదేరి వెళ్ళారు. అయితే, రాత్రి 9 గంటలు దాటినా వెళ్ళిన పిల్లలు ఇళ్లకు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఒకరికొకరు ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకుని పిల్లలు ఇళ్ళకు రాలేదని తెలుసుకుని ఎంతో ఆదుర్దాగా ఊరంతా పరుగులు తీస్తూ అంతా వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో వెదుకుతూనే చెముడుగుంట చెరువు వద్దకు వెళ్లి చూస్తే..అక్కడ పిల్లల సైకిళ్ళు, దుస్తులు కనిపించాయి. పిల్లలు ఏమైపోయారోనని తీవ్రమైన ఆందోళనతో వెంటనే వెంకటాచలం పోలీసులకు అందరూ సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సిఐ రామకృష్ణ, ఎస్ఐ కరిముల్లాతో పాటు అగ్నిమాపక సిబ్బంది అంతా వచ్చి చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అయినా, ఫలితం లేకపోయింది. రాత్రి వేళ కావడంతో గాలింపుకు వీలుకాలేదు. దాంతో మళ్ళీ సోమవారం ఉదయం నుంచి చెరువునంతా గాలించారు. కన్నబిడ్డలు ఏమైపోయారోనని ఆ తల్లిదండ్రుల రాత్రంతా రోదిస్తూ పడిన వేదన అంతా ఇంతా కాదు. చివరికి చెరువులోని పదిహేనడుగుల గుంతలో నుంచి వారి మృతదేహాలను వెలికితీశారు. హాయిగా ఆడుకుని వస్తామని చెప్పి వెళ్ళిన తమ కన్నబిడ్డలు ఇలా శవాలుగా మారడం చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ కుప్పకూలిపోయారు. వారి రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదం అలముకుంది. బుజబుజనెల్లూరు శోకసాగరంలో మునిగిపోయింది. ఆ చిన్నారుల మృతదేహాలను వెలికి తీసి, పోలీసులు ఈ దుర్ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అతివేగంతో..కోళ్ళ లారీ బోల్తా

అతివేగం అనర్థదాయకమని ఎవరెంతగా చెప్తున్నా వాహన చోదకులు ఖాతరు చేయకుండా చిత్తం వచ్చినరీతిగా వాహనాలు నడుపుతూనే ఉన్నారు. ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. ఈనెల 14న మనుబోలు మండలంలోని చెర్లోపల్లి క్రాస్ రోడ్డు దగ్గర జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కోళ్ళలారీ బోల్తా పడిపోవడంతో అందులో ఉన్న దాదాపు అయిదువందల కోళ్ళు చనిపోయాయి. చిత్తూరు జిల్లా నుంచి నెల్లూరుకు కోళ్ళ లోడుతో వస్తున్న ఈ మినీలారీ వేగంగా వస్తూ అదుపుతప్పి బోల్తా కొట్టినట్లు తెలుస్తోంది. దీంతో లారీ దెబ్బతినడమే కాక దాదాపు ఒకటిన్నర లక్షల రూపాయల దాకా నష్టం జరిగి ఉండవచ్చని అంచనా.

## షర్మిల పార్టీ పెడితే తప్పేంటి..?




దివంగత మహానేత వైయస్ రాజశేఖర రెడ్డి గారి తనయ షర్మిల, తెలంగాణలో పార్టీ పెట్టబోతున్నట్లు వచ్చిన వార్త చాలా చోట్ల ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. అవును ఆమె పార్టీ పెడుతుంది, అయితే తప్పేంటి. పత్రికలు, విశ్లేషకులు ఈ విషయాన్ని ఎందుకింత పెద్దదిగా చేసి మాట్లాడుకుంటున్నారో నాకు అర్థం కావడంలేదు. అన్నా చెల్లెళ్ళ మధ్య పోరుగా దీనిని చిత్రీకరిస్తున్నారు. షర్మిల తెలంగాణలో పార్టీ పెట్టడానికీ, ఆంధ్రాలో పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఏ విధంగా ముడిపెట్టి చూడాలో నాకైతే అర్థం కావడంలేదు. ఇద్దరూ రాజశేఖరరెడ్డి సంతానమే కదా అని కొంతమంది వాదిస్తారేమో, కానీ షర్మిల ఎప్పుడో పెళ్ళిచేసుకుని అత్తగారింటికి వెళ్ళిపోయింది. ఆమె ఇప్పుడు తెలంగాణ కోడలు. పుట్టింట్లో అన్న కష్టాల్లో ఉన్నప్పుడు.. అన్న జైలుకి వెళ్ళినప్పుడు ఆమె వచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచింది. అంత మాత్రాన ఆమె ఆంధ్రా రాజకీయాల్లోకి రావలసిన అవసరం ఏముంది..?

ఒకవేళ నిజంగా ఇది అన్నాచెల్లెళ్ల మధ్య వివాదమే అయితే, ఆమె తెలంగాణలో పార్టీ పెడితే, అందువల్ల వాళ్ళ అన్న నష్టపోయేదేమీ ఉండదు. తెలంగాణలో పార్టీ పెట్టినందువల్ల లాభపడినా, నష్టపోయినా ఆ ఫలితం ప్రభావం షర్మిల పైనే ఉంటుంది తప్ప నాకు తెలిసినంతవరకూ జగన్మోహన్‌రెడ్డికి పెద్దగా నష్టం ఉండకపోవచ్చు. కాబట్టి షర్మిల పార్టీ పెట్టడాన్ని భూతద్దంలో చూపి, వివాదం చేయవలసిన అవసరం లేదు.

**– యం.చంద్రమౌళి, కొత్తఢిల్లీ.**

## అస్తవ్యస్థంగా ఉన్న నెల్లూరు ట్రాఫిక్

నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్థంగా ఉంది. అసలు ట్రాఫిక్ పోలీసు వ్యవస్థ ఉందా.. లేదా..? అన్న అనుమానం కలుగుతోంది. ముఖ్యంగా ఆర్‌టిసి బస్టాండు, నెహ్రూబొమ్మ, వీఆర్‌సి కూడళ్ళతోపాటు గాంధీబొమ్మ నుండి ఏసి బొమ్మ వరకు ఇష్టారాజ్యంగా వాహనాలను రోడ్లపైనే నిలిపినా అడిగే నాధుడే లేడు. నర్తకి సెంటర్ వద్ద, ఆత్మకూరు బస్టాండు వద్ద కూడా ఇదే పరిస్థితి. జన సంచారం, వాహన సంచారం తక్కువగా వున్న ప్రాంతాలలో మాత్రం పోలీసులు మాటేసి, లైసెన్సులు, సీ బుక్కులు అంటూ హింసించి డబ్బులు గుంజుతున్నారు. అసలు ట్రాఫిక్ పోలీస్ వుండేది టార్గెట్లు పెట్టుకుని డబ్బులు దండడానికా..? లేక ట్రాఫిక్‌ను అదుపుచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడడానికా..?? అన్న అనుమానం కలుగుతోంది. జిల్లా ఎస్‌పి గారు చొరవ తీసుకుని ప్రజల ఇబ్బందులు గమనించవలసిందిగా విజ్ఞప్తి.

**ఆర్.పి.రామయ్య, కొండాయపాళెం**

# మోగిన మునిసిపల్ ఎన్నికల భేరీ

- మార్చి 10న ఎన్నికలు
- ఆత్మకూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్ళూరుపేటల్లో మొదలైన రాజకీయాల వేడి

ఒకవైపు పల్లెల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతుండగానే మరోవైపు నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో ఎన్నికల భేరీ మోగింది. ఈనెల 15న ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రాష్ట్రంలోని 12 నగర పాలక సంస్థలు, 140 పురపాలక సంస్థలకు ఎన్నికలు జరుగనున్నాయి. కరోనా కారణంగా వాయిదా పడిన ఎన్నికలు గత ఏడాది ఎక్కడ అగాయో అక్కడినుంచే మళ్ళీ మొదలయ్యేలా ఎన్నికల కమిషన్ రీ–నోటిఫికేషన్ జారీ చేయడంతో మునిసిపాలిటీల్లో ఎన్నికల సందడి నెలకొంది. మార్చి 2న ఈ ప్రక్రియ పున: ప్రారంభం అవుతుంది. 3న నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. మార్చి 10వ తేది ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్ జరుగుతుంది. 14న ఓట్ల లెక్కింపు జరిగి, ఫలితాలు ప్రకటిస్తారు.

### జిల్లాలో నాలుగు చోట్ల

పంచాయతి ఎన్నికల నేపథ్యంలో మునిసిపల్ ఎన్నికలు కూడా జరగనున్న నేపథ్యంలో జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. కోర్టు కేసులు ఇతరత్రా కారణాల వల్ల నెల్లూరు నగర పాలక సంస్థతో పాటు, కావలి, గూడూరు మునిసిపాల్టీల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కాలేదు. జిల్లాలోని ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరిల్లో ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయడంతో ఆయా మునిసిపాలిటీల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లయింది. గత ఏడాది మార్చి మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రారంభమై, రెండో వారంలో నామినేషన్ల ప్రక్రియ వరకు జరిగింది. తాజాగా విడుదలైన నోటిఫికేషన్‌తో ఎక్కడ ఆగాయో అక్కడి నుంచే ఎన్నికల ప్రక్రియ మళ్ళీ ప్రారంభం కానుంది. సూళ్ళూరుపేట మునిసిపాలిటీలో 25 వార్డులు, నాయుడుపేటలో 25 వార్డులు, వెంకటగిరిలో 25 వార్డులు, ఆత్మకూరులో 23 వార్డులతో కలిపి మొత్తం 98 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికలను పటిష్టంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తమవుతోంది.

# విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి - డిఇఓ రమేష్

విద్యార్థుల్లో సృజనాత్మకతకు మెరుగులు దిద్ది, నాణ్యమైన విద్యనందించి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ అన్నారు. ఈనెల 16న ఆయన వింజమూరులోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ర్యాంకులను దృష్టిలో పెట్టుకుని పాఠాలు బోధించడం కాక, విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. తొలుత ఆయన పాఠశాలను పరిశీలించారు. అంతా అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పాఠశాలలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో విద్యార్థులు వెయ్యి మందికి పైగానే ఉన్నారని, అయితే పాఠశాల నిర్వహణకు నిధులు చాలినంతగా లేవని, మరుగుదొడ్లకు నీటి వసతి లేదని చెప్పారు. విద్యార్థులకు సగం మందికి మాత్రమే యూనిఫాంలు, పుస్తకాలు పంపిణీ చేశారని, అదేవిధంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులు సమయాన్ని ఎక్కువగా కేటాయించినప్పటికీ సిలబస్ పూర్తి చేయడం కష్టంగా ఉందని డిఇఓకి వివరించారు. ఆ సమస్యలన్నిటినీ పరిశీలించి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని డిఇఓ రమేష్ ఉపాధ్యాయులకు తెలిపారు.


ఉత్తరక్రియలు



మా ఇంటి దైవం, మాకు మార్గదర్శకులు

శ్రీ సామంతు సుబ్బారెడ్డి గారు

(కోవూరు షుగర్ ఫ్యాక్టరీ మాజీ ఛైర్మెన్)

తే. 9.2.2021ది మంగళవారం స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుటుంబసభ్యులు

వారి పెద్దకర్మ

తేది. 25.02.2021 గురువారం బుచ్చిరెడ్డిపాళెం మండలం, మినగల్లు గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును.

కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.





## అయోధ్య రామయ్యకు

# పాతిక లక్షల విరాళం

- అందజేసిన వేమిరెడ్డి దంపతులు

నిరంతరం భగవత్ చింతనలో తరిస్తూ ఎన్నో దైవకార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలందరి ఆదరాభిమానాలు అందుకుంటున్న వేమిరెడ్డి దంపతులు అయోధ్యలోని శ్రీరామాలయం నిర్మాణానికి కూడా తమవంతు విరాళమిచ్చి తమ భగవద్భక్తిని చాటుకున్నారు. అయోధ్య రామమందిర నిర్మాణానికి పాతిక లక్షల రూపాయల భూరి విరాళమిచ్చి అందరి అభినందనలు అందుకున్నారు. ప్రముఖ వదాన్యులు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టిటిడి బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు అయోధ్య రామమందిరానికి తమ విరాళంగా 25 లక్షల రూపాయల చెక్కును ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ భరత్‌కు ఈనెల 15న అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత సంఘ్‌చాలక్ బయ్యా వాసు తదితరులు పాల్గొన్నారు.

# 10 లక్షలిచ్చిన బీద



శ్రీరామ మందిరం నిర్మాణానికి కావలి మాజీ శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు కూడా 10 లక్షల రూపాయల విరాళమిచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆ విరాళం మొత్తాన్ని బిఎంఆర్ గ్రూప్ సంస్థల తరఫున ఆర్‌ఎస్‌ఎస్ జనరల్ సెక్రటరీ భాగయ్యకు ఈ నెల 17న చెన్నైలోని తన నివాసంలో అందజేశారు.

# శ్రీసిటీలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు




రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల అవగాహన కల్పించడానికి, దాని ప్రాముఖ్యతను ప్రచారం చేసేందుకు ఈ నెల 17న శ్రీసిటీలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పోలీసు శాఖ, శ్రీసిటీ సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగులు, సాధారణ ప్రజలకు రోడ్డు భద్రతా సమస్యల ఆవశ్యకతను చాటిచెప్పారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం ముఖ్యమని చెప్పారు. అన్ని రకాల రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నియమనిబంధనలు పాటించాలని, వాహనాలు అతివేగంతో నడపకూడదని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా వాహనాలు నడపాలని వారికి సూచించారు. శ్రీసిటీ సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ హెడ్ వై.రమేష్, శ్రీసిటీ ఎస్సై అరుణకుమార్‌రెడ్డి, ఏఎస్సై బాలచంద్రన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## డ్రైవింగ్‌లో నిబంధనలు తప్పనిసరి

**- జేసీ హరేందిరప్రసాద్**




రోడ్డు ప్రమాదాల వల్ల ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని, వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్ అన్నారు. 32వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీని జేసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది 1142 ప్రమాదాలు జరిగాయని, వీటిలో 503 మంది మృతిచెందారని, మరో 1175 మంది తీవ్ర గాయాలతో అంగవైకల్యానికి గురై ఎంతో కష్టనష్టాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతి వేగం అనర్థదాయమని, వాహనచోదకులు ఎంతో జాగ్రత్తగా వాహనాలు నడపాలని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని, కారులో ప్రయాణించే సమయంలో సీటు బెల్ట్ పెట్టుకోవాలని, తప్పనిసరిగా అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, తద్వారా ప్రమాదాల నివారణకు కృషిచేయాలని సూచించారు. ఆర్టీసి ఆర్ఎం శేషయ్య, డిటిసి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ధరలు పెరుగుతున్నా పట్టించుకోరేం?

**కోటంరెడ్డి శీనయ్య**

ఒకవైపు గ్యాస్‌ధరలు, పెట్రోల్ ధరలు, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరిగిపోతూ సామాన్య ప్రజల జీవితం దయనీయంగా తయారవుతున్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్టించు కోకపోవడం దారుణమని, రోజురోజుకు ధరలను పెంచేస్తున్నా కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి ఎందుకు ప్రశ్నించలేకపోతున్నారని టిడిపి నెల్లూరు నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈనెల 16న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పెట్రోలు, గ్యాస్‌ధరలు పెరిగిన ప్రతిసారీ తమ ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఇవ్వడం జరిగేదని, ఇప్పుడు ఆ ఊసే లేదని అన్నారు. భగ్గుమనే ధరలతో సామాన్యప్రజలు కడుపు నిండా తిండి కూడా తినలేని దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని, ప్రజలపై పైసా కూడా భారం పెంచేదిలేదని ఎన్నికల ముందు మాటిచ్చిన జగన్ ఇప్పుడెందుకు ఇళ్ల పన్నులు పెంచుతున్నారో చెప్పాలని ఆయన అన్నారు. పెంచిన ధరలు తగ్గించేందుకు ప్రజలు తమతో కలసి పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు జహీర్, కప్పిర శ్రీనివాసులు, ప్రసాద్, ఆకుల హనుమంతు, సాబీర్‌ఖాన్, పసుపులేటి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ వారియర్స్ నిరాహారదీక్ష



కరోనా సమయంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కోవిడ్ వారియర్స్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ, ఇటీవల విధుల నుంచి తొలగించబడిన వైద్య ఉద్యోగులు ఈనెల 16న నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఎదుట నిరాహారదీక్ష చేపట్టారు. కరోనా కాలంలో తాము రోగులకు అత్యుత్తమ వైద్యసేవలు అందించామని, అయితే తమకిచ్చిన కాలపరిమితి అయి పోయిందంటూ తమను విధుల నుంచి తొలగించడం భావ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు, రేడియోగ్రాఫర్లు వంటి వివిధ క్యాడర్లలో పనిచేసిన వైద్య సిబ్బంది సేవలను ఉపయోగించుకుని తమను కొనసాగించేలా ప్రభుత్వాలు ఆదేశాలు జారీచేయాలని వారు కోరారు.

### రైతు భరోసా కేంద్రాల్లోనే

## ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాలు

ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లాలోని 666 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ళ కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలని జిల్లా ఇన్‌చార్జి జేసీ, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రోజ్‌మాండ్ చెప్పారు. ఈనెల 15న కలెక్టరేట్ ఆవరణంలోని డిఆర్‌డిఏ కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లాలోని గ్రామ వ్యవసాయ సహాయకుల శిక్షణా కార్యక్రమంలో డిఎం పాల్గొని మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడకుండా మద్దతు ధరకు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకునేలా వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులందరూ విధిగా ఈ-క్రాప్‌లో తమ పంటల వివరాలను నమోదయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి బాలకృష్ణారావు, డిసిఎంఎస్ జనరల్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ మజ్దూర్ యూనియన్‌కు కొత్త కార్యవర్గం

వైఎస్సార్ మజ్దూర్ యూనియన్ నెల్లూరు రీజియన్‌కు ఈనెల 15న కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నెల్లూరు ఆర్టీసి డిపో ఆవరణంలోని ఆ సంఘం కార్యాలయంలో కొత్త కమిటీ ఎన్నిక జరిగింది. రీజనల్ చీఫ్ అడ్వయిజర్‌గా ఐ.హనుమంతరావు, ఛైర్మన్‌గా ఎం.చిన్నారెడ్డి, అధ్యక్షుడిగా ఎస్‌కె ఫయాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె కుతుబుద్దీన్, టి.రాఘవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ దయాకర్, కార్యదర్శిగా సిహెచ్ నరసింహులు, సంయుక్త కార్యదర్శిగా కె.జనార్దన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బి.వీణయ్య, పివి కృష్ణయ్య, సురేష్, ప్రచార కార్యదర్శిగా చలపతి, కోశాధికారిగా పెంచలరెడ్డి, గ్యారేజీ గ్రీవెన్స్ కార్యదర్శిగా నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఆర్టీసి రీజనల్ మేనేజర్ శేషయ్యకు నాయకులు పరిచయం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు టిఎస్ఎస్ ప్రసాద్, నిషాద్, వెంకటేశ్వర్లు, బాబు, వెంకటాద్రి, రవిశంకర్, జిలాని తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు వైద్యపరీక్షలు

నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న వైద్య శిబిరం ఏర్పాటుచేసి వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు కె.అంకిరెడ్డి, బి.కృష్ణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, గోపీనాథ్, జయదేవ్‌లు పాల్గొని వాకర్స్‌కు బిపి, రక్తపరీక్షలు చేసి వారికి అవ సరమైన సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసో సియేషన్ అధ్యక్షుడు బాసం శేష గిరిరావు, గౌరవ అధ్యక్షుడు కిలారి తిరుపతినాయుడు, కోశాధికారి తుంగా సుబ్బరామిరెడ్డి, ఎస్ రాఘ వేంద్రశెట్టి, చింతా ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి), జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎమ్మెస్) లకు పర్సన్ ఇన్‌చార్జిగా జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఈనెల 15న బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు సంస్థల పాలకవర్గాల గడువు జనవరి 30వ తేదితో ముగియడం, వాటి గడువును మరో రెండేళ్లపాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జేసీని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. జిల్లా సహకారశాఖ అధికారి కె.తిరు పాల్‌రెడ్డి, డిసిసి బ్యాంకు సిఇఓ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

### గురువులను సత్కరించుకున్న

## పూర్వవిద్యార్థులు

నెల్లూరు నగరంలోని శ్రీ విద్యా నికేతన్‌లో 1995-96లో చదువు కున్న విద్యార్థులు ఈనెల 14న స్థానిక మద్రాసుబస్టాండ్ సమీపం లోని ఓ మినీఫంక్షన్‌హాల్‌లో సమా వేశమై తమ చిన్ననాటి జ్ఞాపకా లను గుర్తుచేసుకుని ఆనందించారు. తమకు అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి, వారి ఆశీస్సులను అందుకున్నారు. పేద విద్యార్థులకు తమవంతు సాయం అందించాలని ఈ సంద ర్భంగా పూర్వ విద్యార్థులు తీర్మా నించుకున్నారు.

### వీరజవాన్లకు

## ఘన నివాళి

రెండేళ్ళ క్రితం పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీరజవాన్లకు జిల్లా బిజెపి నాయ కులు ఈనెల 14న ఘన నివాళు లర్పించారు. నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్ర మంలో పుల్వామా అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు శ్రద్ధాంజలి ఘటిం చారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, యశ్వంత్‌సింగ్, రాధాకృష్ణగౌడ్, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

### దామోదరం సంజీవయ్య జీవితం

## అందరికీ ఆదర్శనీయం

**జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శనీయమైనదని, ఆయన నిస్వార్థ నిరాడంబర నాయకునిగా రాణించి అందరికీ మార్గదర్శకులయ్యారని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కొనియాడారు. ఈనెల 14న దామోదరం సంజీవయ్య శతజయంతి వేడుకల సందర్భంగా నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణంలో ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో ఆయన జిల్లా ఎన్నికల పరిశీలకుడు బసంత్‌కుమార్‌తో కలసి పాల్గొని మాట్లాడుతూ దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టారని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. బసంత్ కుమార్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య నీతినిజాయితీలకు ప్రతీకగా ఉండేవారని, జాతికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తొలుత దామోదరం సంజీవయ్య చిత్రపటానికి వక్తలందరూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ హరేందిరప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటి డైరెక్టర్ జీవపుత్రకుమార్, డ్వామా పీడీ తిరుపతయ్య, స్వాతంత్ర్య సమర యోధుడు కెవి చలమయ్య, కలెక్టరేట్ ఏ.ఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఆ మహనీయుని సేవలు మరువలేం : జిల్లా ఎస్పీ



తెలుగుజాతి గర్వించదగిన నేత దామోదరం సంజీవయ్య అని, ఆ మహనీయుని సేవలు మరువలేమని, కేవలం 38 సంవత్సరాల చిన్న వయసులోనే ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీబాధ్యతలు నిర్వహిం చడం అపూర్వమని, అంతేకాక ఆయన కేంద్ర ప్రభుత్వంలోనూ అనేక పదవులు నిర్వహించి తన నిస్వార్థ సేవలతో ఆ పదవులకే వన్నె తెచ్చారని జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, ఏఆర్ డిఎస్పీ ఎం.గాంధీ, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి, పిఆర్ఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## గంజాయి ముఠా.. గుట్టు రట్టు



ఇతర ప్రాంతాల నుంచి సైగ్గా గంజాయిని తీసుకువచ్చి నెల్లూరులో గుట్టుచప్పుడు కాకుండా అమ్ముకుంటున్న అయిదుగురిని అరెస్టు చేసి వాళ్ళ దగ్గర నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 15న నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమా వేశంలో ఇన్‌స్పెక్టర్ పి.రామకృష్ణ ఆ వివరాలను తెలియజేశారు. బుజబుజ నెల్లూరు వద్ద ఉన్న జాతీయరహదారి సమీపంలో గంజాయిని తరలిస్తున్నా రన్న సమాచారంతో జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఆదేశాలతో నగర డిఎస్పీ జె.శ్రీనివాసులురెడ్డి, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ లక్ష్మణ్‌రావు, పోలీసు సిబ్బంది, రూరల్ మండల తహశీల్దార్‌తో కలసి ఆ ప్రాంతానికి చేరుకుని గంజాయిని తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఉష, అరవ సంపత్, కొండా ప్రవీణ్, ఎస్‌కె ఖలీల్ అలియాస్ అబ్బు, వెంకటాచలంకు చెందిన కె.వినయ్‌లను అదుపులోకి తీసుకుని, వాళ్ళ దగ్గర నుంచి 4.250కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

# నెల్లూరుతో మా కుటుంబానికెంతో అనుబంధం

## త్వరలో నగరమంతా పర్యటిస్తా.. ఆత్మీయులను కలుసుకుంటా

ఆనం రామనారాయణరెడ్డి



సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన తమ కుటుంబానికి నెల్లూరు నగరంతో విడదీయరాని అనుబంధం ఉందని, నాలుగు దశాబ్దాలుగా తమ కుటుంబీకులు నెల్లూరు నుంచే రాజకీయాలు చేశారని, నెల్లూరు నుంచి పోటీచేసి పలుసార్లు గెలుపొందారని, ఇంతటి అనుబంధం ఉన్న నెల్లూరును తాము ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 14న ఆయన నెల్లూరులోని తన స్వగృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ ఏసి సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, తన సోదరుడు ఆనం వివేకానందరెడ్డి, తాను నెల్లూరు నుంచి శాసనసభకు ఎన్నికయ్యామన్నారు. గత ఎన్నికల్లో తాను వెంకటగిరి నుంచి పోటీ చేసినప్పటికీ అధిష్టానం ఆదేశాలతో నెల్లూరుతో పాటు తమకు పరిచయాలున్న మిగతా నియోజకవర్గాల్లో కూడా ప్రచారం చేశామన్నారు. అధిష్టానం ఆదేశంతోనే తాము గత ఎన్నికల్లో వెంకటగిరి నుంచి పోటీచేయడం జరిగిందని, గత 40ఏళ్ళలో తమ కుటుంబంలోని వారు అనేక సందర్భాల్లో నెల్లూరు నియోజకవర్గం నుంచే పోటీచేసి గెలుపొందారని గుర్తుచేశారు. సహజంగా రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సర్వసాధారణమని అంటూ తమకు కుట్రలు కుతంత్రాలు తెలియవని చెప్పారు. నెల్లూరు తమ జీవితంలో ఒక భాగమని, దానినుంచి తమనెవరూ విడదీయలేరని అన్నారు. నాలుగు తరాల నెల్లూరుతో తమ కుటుంబం ముడిపడి ఉందన్నారు. నెల్లూరు నగరమన్నా, నెల్లూరు ప్రజలన్నా తమ కుటుంబానికి ప్రాణమని, అలాంటి ఆత్మీయులను తాము వదులుకోలేమని, త్వరలోనే నగరంలో ప్రతి ఇంటికి వెళ్ళి తమ ఆత్మీయులందరినీ కలుస్తామని చెప్పారు. తమ కుటుంబానికి జిల్లా వ్యాప్తంగా ఆత్మీయులు, అభిమానులు ఉన్నారని, తాము ఎక్కడి నుంచి పోటీ చేసినా ప్రజలు తమపట్ల ఆదరణ చూపుతున్నారని చెప్పారు. వైకాపాకు ప్రజల అండదండలు మెండుగా ఉన్నాయని, పంచాయతి ఎన్నికల్లో ప్రజలు బలమైన తీర్పునిచ్చి 90 శాతం దాకా ప్రజలు వైకాపాకి అండగా ఉన్నామని నిరూపించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తమ నియోజకవర్గంలోని కలువాయి మండలంలో కూడా 18పంచాయతీలను వైకాపా మద్దతుదారులే గెలుచుకున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు కేవలం ఉనికిని కాపాడుకునేందుకే వైకాపాపై లేనిపోని విమర్శలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో తొలుత కలువాయి మండలంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులను ఆయన పరిచయం చేశారు. కలువాయి మాజీ జడ్పీటిసి బి.అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఇరవై నెలల సుపరిపాలనకు ఈ విజయాలే నిదర్శనం

మంత్రి మేకపాటి గౌతంరెడ్డి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇరవై నెలల సుపరిపాలనకు ఈ పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న విజయాలే ఒక నిదర్శనమని, ముఖ్యమంత్రి ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ విధానాలే తమ గెలుపుకు బాటలు వేస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. ఈనెల 14న నెల్లూరు నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గంలో వైకాపా మద్దతుతో గెలిచిన 112 మంది సర్పంచ్‌లను మంత్రి అభినందించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా ఓటర్లు అభ్యర్థులను ఎన్నుకున్నారని, అత్యధికశాతం మంది వైకాపా మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఎన్నిక కావడం శుభపరిణామమని అన్నారు. తొలుత మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలసి వారు ఆశీస్సులు తీసుకున్నారు. వైఎస్సార్సీపి నియోజవర్గ ఎన్నికల పరిశీలకులు బల్లి కల్యాణ్‌చక్రవర్తి, మండల పార్టీ కన్వీనర్లు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పందిళ్ళపల్లి సుబ్బారెడ్డి, కంటాబత్తిన రఘునాధరెడ్డి, బోయళ్ళ పద్మజారెడ్డి, చిట్టమూరు జితేంద్రనాధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ ఎన్నికలకు పటిష్టంగా ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు



రాష్ట్ర ఎన్నికల కమిషన్ మునిసిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీచేసిన నేపథ్యంలో జిల్లాలో అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేస్తున్నామని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 15న ఆయన నెల్లూరులోని తన చాంబర్లో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలోని ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరి పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, న్యాయస్థానాల్లో కేసులు, తదితర కారణాల వల్ల నెల్లూరు కార్పొరేషన్, గూడూరు, కావలి, బుచ్చి, అల్లూరు మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడం లేదని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గతంలో ఎక్కడైతే ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందో, అక్కడి నుంచి తిరిగి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అందుకు అవసరమైన సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. మార్చి 10వ తేదిన పురపాలక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వెంకటగిరి మునిసిపాలిటీల పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం జరిగిందని, ఆయా ప్రాంతాల్లో ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# బిట్రగుంటలో సోలార్‌పార్క్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- రైల్వే జిఎం గజానన్ మాల్యా వెల్లడి



జిల్లాలోని బిట్రగుంటలో రైల్వే శాఖకు పుష్కలంగా స్థలం ఉన్నందును ఇక్కడ సోలార్ ఏర్పాటుకు ప్రతిపాదనలున్నాయని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా చెప్పారు. ఈనెల 16న ఆయన బిట్రగుంట రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఇక్కడ కొత్తగా నిర్మించిన సిఅండ్‌డబ్ల్యు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కొత్త రైల్వేస్టేషన్లో నెలకొల్పిన ఎనిమిది స్టాల్స్‌ను సందర్శించారు. నూతనంగా ఏర్పాటుచేసిన మూడవ లైనుపై గూడ్స్ రైలు ట్రయల్‌కు పచ్చజెండా ఊపి తాత్కాలికంగా ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోవిడ్ కారణంగా రైల్వే కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, మూడవ లైను తదితర అభివృద్ధి పనుల్లో కొంత జాప్యం జరిగిందన్నారు. ఈ సందర్భంగా బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ నూరుద్దీన్, ఎం.రాజేశ్వరి తదితరులు ఆయన్ను కలసి బిట్రగుంట రైల్వే అభివృద్ధిని కోరుతూ వినతిపత్రం అందజేశారు. నాటి బిట్రగుంట రైల్వే వైభవానికి ప్రతీకగా ఉన్న ఫోటో ఆల్బమ్‌ను ఆయనకు చూపించారు. అందుకు స్పందించిన రైల్వే జిఎం రైల్వేపరంగా బిట్రగుంట మంచి ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని, దీనిని బాగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయని చెప్పారు. అందులో భాగంగానే సోలార్ పార్కు ఏర్పాటు వంటి ప్రతిపాదనలున్నట్లు తెలిపారు. ఆయన వెంట విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్, ఏడిఆర్‌ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. రైల్వే జిఎం తన పర్యటనలో భాగంగా నెల్లూరు దగ్గరలో ఉన్న వెంకటాచలం రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ పరిసరాలను, రికార్డులను, టెక్నికల్ విభాగం వగైరాలను పరిశీలించారు. తొలుత, అనుపల్లిపాడు రైల్వే గేటు, కొమ్మలపూడి-వెంకటాచలం మధ్యలో ఉన్న వంతెనలను కూడా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు

భారత రాజ్యాంగం మనకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ నెల్లూరు నగరంలోని సుంకు చెంగన్న మునిసిపల్ హైస్కూల్‌లో ఈనెల 15న న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా జడ్జి యామిని ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో పౌరుల ప్రాథమిక హక్కులు, బాధ్యతలను విద్యార్థులకు కూలంకుషంగా వివరించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌తో పాటు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'మిషన్ ఇంద్రధనుష్'ను జయప్రదం చేయాలి

- డబ్ల్యుహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ నీరద

'మిషన్ ఇంద్రధనుష్' కార్యక్రమం ద్వారా రెండేళ్ళలోపు చిన్నారులకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు వేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రపంచ ఆరోగ్యసంస్థ కన్సల్టెంట్ డాక్టర్ నీరద పేర్కొన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంపై ఈనెల 16న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్యవంతమైన సమాజానికి టీకా తప్పనిసరి అని ఆమె తెలిపారు. ప్రతి శనివారం, బుధవారం రోజుల్లో జరగనున్న ఈ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

# విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలి

- రాష్ట్ర విద్యుత్ ఇంధన శాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్

జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు, రైతుల వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడా విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని రాష్ట్ర విద్యుత్ ఇంధనశాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఈనెల 16న ఆయన జిల్లాలోని విద్యుత్ అధికారులతో తిరుపతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులు కృషిచేయాలని, జిల్లాకు సంబంధించి ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు చెల్లించాల్సిన సుమారు 148కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలను ఆరునెలల్లోగా వసూలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని 1,95,131 మంది రైతుల విద్యుత్ సర్వీసులకు నగదు బదిలీ పథకాన్ని అనుసంధానం చేసే ప్రక్రియను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఇఇలు రమణదేవి, శ్రీహరిరావు, శ్రీధర్‌రెడ్డి, జగదీష్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సురేంద్రరావు. అకౌంట్స్ అధికారి మధుకుమార్ పాల్గొన్నారు.







## స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి జయంతికి..

# రక్తదాన శిబిరం

### ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 86వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 20వ తేది ఉదయం నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్మించిన నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ సిహెచ్ అజయ్‌బాబు, ఆయన సిబ్బంది, గూడూరు ఏరియా ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గంగాధరంతో పాటు ఆయన సిబ్బంది వచ్చి దాతల నుంచి రక్తాన్ని సేకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో వరుసగా 2018, 2019 సంవత్సరాలకు అత్యధికంగా రక్తయూనిట్లు సేకరించి రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచినందుకు తమ ఫౌండేషన్ రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా రాజ్‌భవన్‌లో అవార్డులను స్వీకరించిందని ఆయన పేర్కొంటూ, గత ఏడాది కన్నా ఈసారి ఎక్కువగా ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని విద్యార్థులు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది, బంధువులు, అభిమానులు ఉత్సాహంగా ఉన్నారని ఆయన తెలిపారు. ఇదే కాక, స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా మరెన్నో సేవా కార్యక్రమాలను తాము ప్రతిఏటా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎన్‌బికెఆర్‌కు 'న్యాక్' అక్రిడిటేషన్ కొనసాగింపు



కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి కళాశాలకు మూడవసారి ఏ-గ్రేడ్‌తో ఎన్ఏసిసి (న్యాక్) గుర్తింపు కొనసాగింపబడిందని ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఈనె 16న కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఫిబ్రవరి 12, 13తేదీల్లో న్యాక్ పరిశీలక బృందం తమ కళాశాలను సందర్శించిందని, బోధన సిబ్బంది స్థాయి, నాణ్యతలు, మౌలిక సౌకర్యాలు సమర్ధవంతమైన పనితీరు ఇలా అన్ని రకాల అంశాలను పరిశీలించి తమ నివేదికను ఉన్నతస్థాయి కమిటీలకు పంపడం జరిగిందని తెలిపారు. 2008 నుంచి తమ కళాశాల అదివరకే అత్యున్నతస్థాయి ఏ-గ్రేడ్‌తో న్యాక్ గుర్తింపు కలిగివుందని, ఇప్పుడు 2026వ సంవత్సరం వరకు ఆ గుర్తింపును కొనసాగిస్తూ న్యాక్ ఉత్తర్వులిచ్చిందని ఆయన వివరించారు. తమ కళాశాల అటానమస్ స్థాయిని కలిగి ఉండడం, తాము నడుపుతున్న కోర్సులకు ఎన్‌బిఏ గుర్తింపు, టైర్-1 స్థాయిలో 5వ సారి కలిగివుండడంతో పాటు ఇప్పుడు కొనసాగించబడిన ఏ-గ్రేడ్ న్యాక్ గుర్తింపుతో కళాశాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళేందుకు దోహదపడుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కళాశాల ప్రగతికి ఎంతగానో తోడ్పడుతూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణలు కల్పిస్తూ వారి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలోను, అన్ని రంగాల్లో అవసరమైన వసతులను కల్పించడంలోనూ వారుచేస్తున్న కృషి ద్వారానే ఇలాంటి గుర్తింపు హోదాలను సాధించగలుగుతున్నామని ఆయన చెప్పారు. కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న సిబ్బందిని, విద్యార్థులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

## నెల్లూరు కవి 'బొగ్గరపు'కు సన్మానం



నెల్లూరు కవి బొగ్గరపు రాధాకృష్ణమూర్తికి ఇటీవల ప్రకాశం జిల్లా కందుకూరులో ఘనసన్మానం లభించింది. హైదరాబాద్‌లోని 'అక్షరస్వర సరం' సంస్థ వ్యవస్థాకులు డా.బొట్లగుంట కోటయ్య తన తల్లిదండ్రుల స్మారకార్థం రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో బొగ్గరపు రచించిన 'బాల్యాన్ని బ్రతకనివ్వండి' అనే కవితకు ద్వితీయ బహుమతి లభించింది. కందుకూరులోని శ్రీ వెంగమాంబ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, డా.బొట్లగుంట కోటయ్య, డా.స్వర్ణ వేంకటేశ్వరరావు, అలంకారం విజయకుమార్ పాల్గొని కవిని సన్మానించడంతో పాటు నగదు బహుమతిని కూడా అందజేశారు. ఈ సందర్భంగా బొగ్గరపును నెల్లూరులోని ప్రముఖ కవి చిన్ని నారాయణరావు, సాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్, పేరిశెట్ల శివకుమార్ తదితరులు అభినందించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### దామోదరం సంజీవయ్యకు

## సబ్‌కలెక్టర్ నివాళి



ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సంఘ సంస్కర్త దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా ఇటీవల గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ ఘనంగా నివాళులర్పించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అఖిల్‌కుమార్, పూర్ణ, బాషా, గోపి, ప్రియాంక, దశయ్య తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### వాహనదారులు

## నిబంధనలు పాటించాలి

**- రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి**



32వ జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా స్వర్ణ టోల్‌వే ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతపై వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా గూడూరు రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, చిల్లకూరు ఎస్ఐ బాబి, గూడూరు పట్టణ ఎస్.ఐ సైదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూరల్ సి.ఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్వర్ణ టోల్‌వే ఆధ్వర్యంలో రహదారి మాసోత్సవాలను నిర్వహించడం చాలా సంతోషకర మన్నారు. రహదారి భద్రతపై పోలీసులకు సహకరిస్తూ ముందు కెళ్తున్నారని అభినందించారు. స్వర్ణ టోల్‌వే సిఓఎం సురేష్‌బాబు, ప్రతినిధులు లోకేష్‌బాబు, వైజె దీపక్, మస్తానయ్య, బాసిత్, కుమార్‌రాజా, మునిరత్నం, విద్యార్థులు, టోల్‌వే ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు లయన్స్ క్లబ్ చేయూత



గూడూరు లయన్స్ క్లబ్ వారు నిర్వహించే ఆహార చేయూత నెలవారి నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమానికి రోటరీ పాస్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి మాతృమూర్తి బొమ్మిరెడ్డి ఇందిరమ్మ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని చేయూత నందించారు. శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో జరిగిన ఈ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యం.రూపేష్‌రెడ్డి, పాస్ట్ రీజియన్ ఛైర్మెన్ యస్.కె.రియాజ్ అహమద్, వాకాటి రామ్మోహన్, ఎం.వి.రమణయ్య, యస్.కె. సాదిక్, జి.మురళి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం



అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలికల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలను ఈ నెల 13వ తేదీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకుడు కనుమూరు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసికోల్లాసం ఉంటుందని చెప్పారు. ప్రతినిధులు చంద్రశేఖర్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ప్రతి విద్యార్థి..

## లక్ష్యాలను సాధించాలి

గూడూరు పట్టణం, మరంవీధిలోని రోటరీ భవనంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తల్లి ఇందిరమ్మ జన్మదినం సందర్భంగా ఇటీవల విద్యార్థులకు కుర్చీలు, అట్టలు అందజేశారు. ఆంధ్ర మహిళా మండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ తరపున ఆయన మాతృమూర్తి జన్మదినం సందర్భంగా ట్రైసైకిల్‌ను చవటపాలెంకు చెందిన రామచంద్రయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని సాధించుకునేందుకు కృషి చేయాలన్నారు. చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానానికి వెళ్లవచ్చునన్నారు. దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సేవా కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.మునిగిరీష్‌రెడ్డి, సురేష్, మల్లయ్య, హరిప్రసాద్, రామకృష్ణారెడ్డి, నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




## 'ప్రగతి' సేవలు



ఈనెల 14న మాలవ్యనగర్‌లోని సబ్‌కలెక్టర్ బంగ్లా ప్రక్కన ఉన్న సచివాలయ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న 15 మంది నిరుపేదలకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షుడు యద్దల నరేంద్రరెడ్డి సహకారంతో 17రకాల ఫలసరుకులను పొనకా మల్లికార్జున్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనంజయరెడ్డి, సెక్రెటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు రవికుమార్, పి.డి. కరిముల్లా, పురందర్‌రాజు, కె.ఆర్.ఎం, శీను, తనుజ్‌కుమార్, రమేష్, కో ఆర్డినేటర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ సమీక్ష

# 'నెల్లూరు సంగతులు' చారిత్రక గ్రంథం




రచన : ఈతకోట సుబ్బారావు
వెల : రూ. 280/- పేజీలు : 304
ప్రతులకు: ఈతకోట సుబ్బారావు
24/1697, 2వ వీధి, రవీంద్రనగర్,
నెల్లూరు - 524004. సెల్: 94405 29785

కవిగా, కథకుడిగా, వ్యాసకర్తగా, పాత్రికే యునిగా, సంపాదకునిగా తెలుగు భాషా సాహిత్యా లకు తనవంతు సేవలను బహుకాలంగా అందిస్తున్న బహుముఖ ప్రజ్ఞావంతుడు ఈతకోట సుబ్బారావు. పైన చెప్పిన లక్షణాలేగాక సుబ్బారావులో గొప్ప పరిశోధకుడు దాగివున్నాడు. ఆ విషయాన్ని ఇదివరకు ఆయన వెలువరించిన నాలుగు చరిత్ర గ్రంథాలు తెలుపుతాయి.

ఇప్పుడు వెలువడిన ఐదవ చరిత్ర గ్రంథం "నెల్లూరు సంగతులు". చరిత్ర రాసేవారు మూలాలకు వెళ్లి విషయాలను గ్రహించాలనే సి.పి.బ్రౌన్ అభి ప్రాయాన్ని శిరోధార్యంగా భావించి, అందుబాటులో ఉన్న మూలాలను పరిశీలించి ఈ గ్రంథాన్ని తీర్చి దిద్దారు రచయిత. నెల్లూరు చరిత్ర – సంఘటనలను శ్రమకోర్చి సేకరించి గ్రంథాలుగా నెల్లూరీయులకు అందిస్తూ, తను పుట్టిన నేల ఋణం తీర్చుకుంటు న్నాడు ఈతకోట. ఎప్పుడూ రాస్తూ, వాటిని ప్రచు రిస్తూ కాలం గడిపే ఈతకోట... ఈతకోట కాదు... రాతకోట.

వేలాది సంవత్సరాల చరిత్ర, సంస్కృతి కలిగిన సింహపురి సీమ ప్రాభవాలు ఎంత చెప్పినా మరెంతో మిగిలే వుంటాయి. వివిధ రంగాలకు చెందిన చారిత్రక నేపథ్యం కలిగి, ఆసక్తి కలిగించే సంక్షిప్త అంశాలే సంగతులు. ఎందరో ఆదర్శమూర్తులకు, పోరాటయోధులకు, త్యాగమూర్తులకు, లబ్ధప్రతిష్టు లకు పేరుగాంచిన సీమ నెల్లూరు. అధిక భాగం మహాభారతాన్ని ఆంధ్రీకరించి, తెలుగుభాషకు సరికొత్త వన్నెలు అద్దిన కవి బ్రహ్మ తిక్కన నుంచి, అనేక భాషల్లో వేలాది పాటలు పాడిన గానగంధర్వుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం వరకు తిరుగాడిన నేల నెల్లూరు సీమ. అలాంటి సీమలో జరిగిన కొన్ని ఆసక్తి కర సంఘటనలను భావితరాలకు అందించాలనే ప్రయత్నాన్ని ఈతకోట దిగ్విజయంగా నిర్వహించారని ఈ గ్రంథం చదివితే తెలుస్తుంది. ఇది ఒక్కరోజులో సాధ్యమయ్యే పని కాదు. బహుకాలం సాగిన పరిశో ధన, కలిగిన ఆలోచనల పరంపరలో రూపుదిద్దుకున్న గ్రంథరాజం ఈ 'నెల్లూరు సంగతులు'.

ఇందుకు ఆయన ఏళ్ల తరబడి కాలాన్ని ఉపయోగించారు. ప్రసిద్ధమైన చారిత్రక గ్రంథాలు చదివి, విషయాన్ని రాబట్టారు. అరుదైన ఫోటోలు, శాసనాలు సేకరించారు. వాటన్నింటిని కలిపి గ్రంథాన్ని ముద్రించారు. ప్రతి విషయాన్ని ఆధారాలతో నిరూపించారు. నెల్లూరుకు ఇంత చరిత్ర ఉందా అని అన్పించారు. పెన్న నీటికి ఎంతో శక్తి ఉందని నిరూపించారు. పలువురు ప్రముఖుల్ని ఓపిగ్గా కలిసి అనేక అద్భుతమైన విషయాలను రాబట్టి పాఠకు లకు అందించారు.

"ఆదిమానవుడి స్థావరం పెన్నాతీరం" అనే మొదటి అధ్యాయం నుండి, "చెదిరిన టి.బి.హాస్పిటల్ చరిత్ర" అనే చివరి అధ్యాయం వరకు ఎన్నో సంఘటనలు... ఎన్నో విశేషాలు... స్ఫూర్తిని కలిగించే వివరాలు... ఎన్నో... ఎన్నెన్నో...

ఈతకోట పాత్రికేయుడిగా ఉంటూ ఏళ్ల తరబడి సాగించిన పరిశోధన ఈ గ్రంథంలో మనకు కన్పించి, అబ్బురపరుస్తుంది. మొదటి పేజీ నుంచి, చివరిపేజీ వరకు పట్టువదలకుండా చదివింపజేస్తుంది. ఆలోచన లతో నింపుతుంది. చారిత్రక విజ్ఞానాన్ని, అవసరాన్ని నొక్కి చెప్తుంది. మనం నెల్లూరీయులం అని గొప్పగా చెప్పుకుని భుజాలెగరేసుకునేలా చేస్తుంది.

వ్యవప్రయాసలకోర్చి ఈ గ్రంథాన్ని రచించి, ముద్రించి తెలుగు పాఠకులకు అందించిన ఈతకోటను ఎంత అభినందించినా తక్కువే! ఇందుకు ఆయనకు సహకారం అందించిన దాతలకూ వందనాలర్పించాల్సిందే. ఒక్క మాటలో చెప్పా లంటే భావితరాలు పదిలంగా తమ ఇంట భద్రపరుచుకోవాల్సిన చారిత్రక గ్రంథం "నెల్లూరు సంగతులు".



సమీక్ష : డా. గంగిశెట్టి శివకుమార్
9441895343

## కొండ బిట్రగుంట ఆలయానికి..
# త్వరలోనే కొత్త రథం
### 87 లక్షలతో పునర్నిర్మాణానికి కృషి



జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయ రథాన్ని పునర్నిర్మించేందుకు 87 లక్షల రూపాయలు వెచ్చించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ విజయ వాడ రీజనల్ జాయింట్ కమిషనర్ ఎస్. చంద్రశేఖర ప్రసాద్ చెప్పారు. ఈనెల 15న నెల్లూరులోని వేదాయ పాళెం ఉడ్‌కాంప్లెక్స్‌లో రథం నిర్మాణానికి అవసర మైన టేకు మానును కొనుగోలు చేశారు. అనంతరం దానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అంతర్వేదిలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి రథాన్ని తయారుచేసిన స్థపతి ఆధ్వర్యంలోనే కొండ బిట్రగుంట రథాన్ని కూడా పునర్నిర్మాణం చేయిస్తామని ఈ సందర్భంగా దేవా దాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ధర్మ కర్తల మండలి ఛైర్మన్ మాల్యాద్రితో పాటు, స్థపతి సురేంద్ర, ఎస్ఇ ఎస్ శ్రీనివాసరావు, గుంటూరు డిఇఇ జనార్ధన్, ఏ.ఇ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల్లో రేషన్ పంపిణీ ప్రారంభం

ఇంటింటికీ రేషన్ పంపిణీ పథకానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలోనూ రేషన్ పంపిణీ ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాహనాలకు వేసిన రంగుల విషయం..తదితర కారణాలతో రేషన్ పంపిణీకి ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసినా రేషన్ పంపిణీని అడ్డుకోవద్దని, ఈ పథకం కొత్తది కాదని చెప్తూ, ఎన్నికల కమిషనర్ ఇచ్చిన ఉత్త ర్వులను మార్చి 15వ తేది వరకు హైకోర్టు నిలుపుదల చేయడంతో పల్లెల్లో రేషన్ పంపిణీ మళ్ళీ మొదలైంది. హైకోర్టు సూచనల మేరకు రేషన్ పంపిణీకి జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రసన్న వేంకటేశ్వరునికి.. పల్లకి సేవ

ఇందుకూరుపేట మండలం, మైపాడులో కొలువై ఉన్న అన్నపూర్ణాంబ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామికి, అమ్మవారికి ఈనెల 15న ప్రత్యేక అలంకారాలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు బందారు ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ కనుపూరు సురేంద్రబాబు పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకకు గంగపట్నం పల్లిపాళెం గ్రామానికి చెందిన కన్నా వెంకటరమణయ్య, అరుణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# సిద్ధమ్మ తల్లికి పొంగళ్ళు

మర్రిపాడు మండలం రాజుపాళెంలో కొలువై ఉన్న సిద్ధమ్మ తల్లి అమ్మవారికి ఈనెల 14న భక్తులు పొంగళ్ళు నైవేద్యం పెట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని పూజారి వీరమ్మ ఆధ్వర్యంలో శోభాయ మానంగా అలంకరించి పూజలు చేశారు.

# సకల శుభదాయకుడు.. 'స్తంభాలగిరి ఈశ్వరుడు'

***శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్రాచీనమైన శివాలయాల్లో దక్కిలి మండలంలోని 'దేవుడు వెల్లంపల్లి' గ్రామంలో కొలువై ఉన్న 'స్తంభాలగిరి ఈశ్వరస్వామి' దేవస్థానం ఒకటి. కష్టాలను తొలగించి, సకల శుభాలను ప్రసాదించే దేవునిగా ప్రఖ్యాతి చెందిన స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక, చెన్నై తదితర దూరప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తుంటారు.***





మన దేవాలయాలు (34)

దేవుడు వెల్లంపల్లి ఈశ్వరయ్యస్వామిగా ప్రసిద్ధి చెందిన స్తంభాలగిరి ఈశ్వరుని దేవాలయం జిల్లాలో ఎంతో ప్రసిద్ధి. దక్కిలి మండలంలోని 'దేవుడు వెల్లంపల్లి' అనే గ్రామంలో ఉన్న ఈ ఆలయంలో ప్రతినిత్యం, ముఖ్యంగా ప్రతి సోమవారం ఈశ్వరయ్యస్వామికి, పార్వతీదేవి అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో నిత్యపూజలు జరుగుతుంటాయి. ప్రతి ఏటా ఇక్కడ జరిగే తిరునాళ్ళకు వేలసంఖ్యలో భక్తజనం వస్తుంటారు. ఎప్పుడూ శివ నామస్మరణతో మార్మోగే ఈ ఆలయం ఆవిర్భావం గురించి పురాతన చరిత్రతోపాటు, కొన్ని ఆసక్తికరమైన కథనాలు కూడా ప్రచారంలో ఉన్నాయి.

## రెండు వందల ఏళ్ళనాటి ఆలయం :

ఈ ఆలయం సుమారు రెండు వందల ఏళ్ళ నాటిదని చరిత్ర. ఈ ఆలయం నిర్మాణం గురించి స్థానికుల కథనం ఇలా ఉంది. పూర్వం గురుకుల పాపయ్య అనే వ్యక్తి ఓ రైతు పొలం వద్ద కాపలాదారుగా ఉండేవాడు. అయితే పాపయ్యకు తెలియకుండా రాత్రివేళల్లో ఒక ఆవు పొలాన్ని మేస్తుండడంతో ఎలాగైనా దానిని పట్టుకోవాలని ప్రయత్నించగా ఆ ఆవు వెలిగొండల్లోకి వెళ్ళి అంతర్ధానమైంది. అయితే, అక్కడ ప్రకృతి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూసి మైమరచిపోయిన పాపయ్య అక్కడున్న స్తంభాలగిరి కోనలో ధ్యానం చేసుకుంటూ నెలల తరబడి ఉండిపోయాడు. ఒకరోజు ఒక మునీశ్వరుడు ప్రత్యక్షమై పాపయ్య భక్తిని చూసి నాలుక మీద బీజాక్షరాలు రాసి, ఒక శివలింగాన్ని పాపయ్యకు ఇచ్చి పూజలు చేస్తుండమని అదృశ్యమయ్యాడు. కొంతకాలానికి పాపయ్య అక్కడి నుంచి దేవుల వెల్లంపల్లికి వస్తాడు. నెలల తరబడిగా స్తంభాలగిరి కోనలోనే ధ్యానం చేసుకుంటూ గడిపినా ఆయనకు ఎలాంటి ఆకలి వేయకపోవడం, ఇంతకాలానికి ఆయన తిరిగి గ్రామానికి వచ్చినా ఆయన శరీరం శుష్కించకుండా ఉండడం, ఆయన మాటలు గంభీరంగా ఉండడం.. ఆ మార్పులను గమనించిన గ్రామస్తులు పాపయ్యను అవధూతగా, పాపయ్య స్వామిగా భావించి ఆరాధించడం ప్రారంభించారు. పాపయ్య తెచ్చిన ఆ మహిమాన్వితమైన శివలింగాన్ని గ్రామంలో ఒక చిన్న పూరింట్లో ప్రతిష్టించి నిత్యం పూజలు చేయడం ప్రారంభించారు. ఆ శివలింగాన్నే 'స్తంభాలగిరి ఈశ్వరస్వామి'గా భక్తులు కొలుచు కునేవారు. పాపయ్య కూడా అలా ఆ పరమేశ్వరుని పూజల్లోనే ఎంతోకాలం తరిస్తూ చివరికి జీవసమాధి పొందాడు. ఆ తర్వాత ఆయన వారసుడు పోలయ్యస్వామి కూడా ఆజన్మాంతం అక్కడ పూజలు చేస్తూ అక్కడే జీవసమాధి చెందాడు. ఆలయ ప్రాంగణంలో నేటికీ పాపయ్యస్వామి, పోలయ్యస్వామిల సమాధులున్నాయి. భక్తులు ఈ సమాధులకు ప్రత్యేకపూజలు చేస్తుంటారు. స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామిని నమ్ముకుంటే ఎలాంటి కష్టాలు ఉండవని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా గ్రహబాధలతో ఇబ్బందులు పడేవారు, సంతానం లేని వారు స్వామికి మొక్కుకుంటే తప్పకుండా వారి కోర్కెలు నెరవేరుతుంటాయని ప్రతీతి.

## వైభవోపేతంగా తిరునాళ్ళ :

దేవుడు వెల్లంపల్లి ఈశ్వరయ్య తిరునాళ్ళంటే జిల్లాలో ఎంతో ప్రసిద్ధి. ప్రతి ఏటా ఏప్రిల్‌లో స్వామివారికి తిరునాళ్ళ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దపెట్టున చేసే శివనామ స్మరణలతో ఊరంతా మార్మోగిపోతూ ఉంటుంది. గిరిజన సంప్రదాయం ప్రకారం స్వామివారికి పూజలు, అభిషే కాలు జరుగుతుంటాయి. స్వామివార్ల తిరునాళ్ళకు వచ్చే భక్తుల సంఖ్య ఏ ఏడాదికాఏడాది బాగా పెరుగుతుండడంతో గతంలో ఒక్కరోజు మాత్రమే నిర్వహించే తిరునాళ్ళను ఇటీవలి కాలంలో మూడు రోజుల పాటు పొడిగించారు. ఈ తిరునాళ్ళలో స్వామి– అమ్మవార్ల కల్యాణోత్సవంతో పాటు, స్వామివారి గ్రామోత్సవం, తెప్పోత్సవం వగైరా సేవలన్నీ ఎంతో వైభవంగా జరుగుతాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ తిరునాళ్ళ రోజుల్లో ఆర్టీసి వారు ప్రత్యేక బస్సులను కూడా దేవుడు వెల్లంపల్లి గ్రామానికి నడుపుతుంటారు.

# పుట్టినింట అన్న - మెట్టినింట చెల్లి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ బిడ్డనే అంటూ తెలంగాణ ప్రజల ముందుకు వస్తోంది షర్మిల.

## జననేతగా చెరగని ముద్ర వేసుకున్న వై.యస్

1978 నుండి 2004 దాకా 26 సంవత్సరాల రాజకీయ పోరాటం, పాతికేళ్ల ప్రస్థానం తరువాత 2003లో 1475 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర, తద్వారా ప్రజల కష్టాలు కన్నీళ్లు తెలుసుకోవడంతో పాటు తనను తాను కూడా తెలుసుకున్న మానవీయమూర్తి దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి.

ఆయన వైద్య పట్టా ద్వారా ప్రజల నాడిని తెలుసుకోవడంతో పాటు, రాజకీయాలను వేదిక చేసుకుని అదే ప్రజల మనసులను కూడా దోచుకున్నాడు. ఆయన జనం మనిషి, నిత్యం జనంలో ఉండడం అంటే ఆయనకు ఇష్టం. తాను ఏ హోదాలో ఉన్నా ఆయన ఒకే పంథాలో ఉండేవాడు. నిత్యం జనంతో మమేకమై వారిలో తానూ ఒకడిగా కలసిపోయేవాడు. జనం అంటే ఆయనకు పిచ్చి. అంతే స్థాయిలో ప్రజలకు కూడా ఆయనంటే మహా పిచ్చి.

2004 మే 14వతేదీ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన తరువాత కూడా ఆయన అదే తరహా జీవన శైలిని కొనసాగించాడు. నిత్యం ప్రజలలో ఉండడానికే ఆసక్తి చూపించేవాడు. 'తన' అనుకున్న వాళ్లందరినీ నిత్యం కలిసేవాడు. తనని కలవని, తన పాత మిత్రుల గురించి వాకబుచేసి, ఆరాతీసి మరీ పిలిపించుకునేవాడు. వాళ్ళ కష్ట సుఖాలు తెలుసుకునేవాడు. వాళ్లందరికీ తానున్నాననే భరోసా ఇచ్చేవాడు. అతి సామాన్య ప్రజల దగ్గర నుండి తనకు అత్యంత సన్నిహితమైన వ్యక్తుల వరకూ అందరికీ నిత్యం అందుబాటులోవుంటూ జననేతగా ఆయన చెరగని ముద్ర వేసుకున్నాడు. 2009 సెప్టెంబర్ 2వ తేదీవరకు ఆయన కనిపించే దైవం, ఆ తరువాత తెలుగువారి గుండెల్లో శాశ్వతంగా గూడు కట్టుకున్న భగవత్ స్వరూపం.

## తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకున్న తనయుడు

వై.యస్. ఆకస్మిక మరణం అనంతరం, ఆయన కుమారుడు వై.యస్.జగన్ మోహన్‌రెడ్డి, తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి సంసిద్ధుడయ్యాడు. తన తండ్రి విషాదాంతాన్ని తట్టుకోలేక అశువులు బాసిన తమ కుటుంబ అభిమానుల కుటుంబాలను, ఓదార్పు యాత్ర పేరుతో పలకరించాలని సంకల్పించాడు. కాంగ్రెస్ అధిష్ఠానం అభీష్టానికి వ్యతిరేకంగా తన యాత్రను కొనసాగించాడు. కష్టాలను ఎదుర్కొన్నాడు, కన్నీళ్లకు ఎదురీదాడు. ఢిల్లీ పెద్దలను ఎదిరించి సొంత కూటమిని ఏర్పాటు చేసుకుని ప్రాంతీయ పార్టీని ప్రకటించాడు, వైయస్ఆర్ అని తన తండ్రి పేరు స్ఫురించేలా యువజన శ్రామిక రైతు పార్టీని 2011, మార్చిల్లో ప్రారంభించాడు. అప్రతిహతంగా ఎదుగుతూ ప్రకాశిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన కాంగ్రెస్ అధిష్ఠానానికి కన్ను కుట్టడం, ఆయనపై సిబిఐని ప్రయోగించి విచారణ పేరుతో 2012, మే27 నుండి 2013 సెప్టెంబర్ 24 వరకు 16నెలలు జైలులో ఉంచడం జరిగిపోయింది.

జగన్‌ని జైలులో ఉంచి ఆయన పరువుని తగ్గించాలని ప్రయత్నించిన సోనియా గాంధీ బృందం పథకం వికటించి, ఆయనకు జనాదరణ మరింత పెరిగిపోవడంతో, జగన్‌మోహన్‌రెడ్డికి చెక్ పెట్టాలనే ఒకే ఒక్క లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసేసింది కాంగ్రెస్‌పార్టీ. ఫలితంగా కొత్త రాష్ట్రానికి పాత నాయకుడు కావాలన్న నినాదంతో 2014లో చంద్రబాబుకు అధికారం కట్టబెట్టి జగన్మోహన్‌రెడ్డిని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు తెలుగు ప్రజలు. ఇక్కడ కూడా జగన్ సంయమనం కోల్పోలేదు. తననుతాను రుజువు చేసుకోవడానికే సిద్ధపడ్డాడు. ప్రజా సంకల్ప యాత్ర పేరుతో 2017 నవంబర్ 6 నుండి 2019 జనవరి 9వతేదీ వరకు 430 రోజుల పాటు 125 అసెంబ్లీ నియోజకవర్గాలలో 3,648 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర చేసి తెలుగునాట నీరాజనాలు అందుకున్నాడు. 2019లో జరిగిన ఎన్నికలలో 175కి గాను 151 సీట్లలో విజయం సాధించి తనకు తిరుగులేదని అనిపించుకున్నాడు.

## జగన్ అందరివాడనిపించుకుంటున్నాడా?

అయితే జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి తరహాలోనే అందరివాడిగా పిలవబడుతున్నాడా..? అందరికీ అందుబాటులో ఉన్నాడా..?? అన్నది ఇక్కడ ప్రశ్నార్థకం. తన చుట్టూ ఒక గిరి గీసుకుని ఉన్నాడన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట. రావాలి జగన్ ... కావాలి జగన్... మన జగన్, అని పరితపించిన వాళ్లలో కనీసం 10 శాతం మందిని కూడా జగన్ దరిదాపుల్లోకి సైతం ఆయన కోటరీ వెళ్లనీయడంలేదన్నది అందరి నోటా వినిపిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటిస్తున్న ప్రభుత్వ పథకాల ద్వారా, ఆయన అందిస్తున్న సంక్షేమ ఫలాల ద్వారా ఆయన జననాయకుడిగా కొలవబడుతున్నాడు తప్ప, ఆయన కోసం పరితపించినవాళ్ళ చేత 'మన' నాయకుడు అని పిలిపించుకోలేకపోతున్నాడన్న ఆవేదన చాలామందిలో వ్యక్తమవుతోంది. ఆయన అధికారంలోకి వచ్చిన 21నెలల కాలంలో ఆయనను ఒక్కసారైనా కలవలేకపోయామే అన్న అసంతృప్తి చాలామందిలో కనిపిస్తోంది. వై.యస్ కుమారుడిగా కనీసం రాజశేఖరరెడ్డిలోని సగం లక్షణాలన్నా ఆయనలో ఉంటాయని వైయస్ సన్నిహితులు ఆశపడడం సహజమే. కానీ ఆ గుణాలు 10 శాతం కూడా కనపడటంలేదన్నది ఇప్పుడు చాలామందిలో వినిపిస్తున్న ఆవేదన. రాబోయేరోజుల్లో ఆయన తలపెట్టిన రచ్చబండ కార్యక్రమం ద్వారానైనా కొంతమందిని కలుస్తాడేమోనన్న ఆశ కూడా కొంత మందిలో కనిపిస్తోంది.రాజన్న వారసుడు నూటికి నూరుశాతం ఆయనలా ఉండకపోయినా కనీసం కొంతమేరకన్నా ఆయనలా ఉండాలన్నది రాజన్న అభిమానుల ఆకాంక్ష

## అనేక అనుమానాలకు తావిస్తున్న షర్మిల నిర్ణయం

ఇప్పుడు తెలంగాణలో షర్మిల రాజకీయ రంగ ప్రవేశం అనేక అనుమానాలకు తావిస్తోంది. తమ అమ్మానాన్నల పెళ్లి రోజు ఫిబ్రవరి 9వతేదీన ఆమె తన నిర్ణయాన్ని తెలిపింది. 'తెలంగాణలో రాజన్న రాజ్యం' తెస్తానని ప్రకటించింది. అంటే ఆమె ఉద్దేశంలో ఆంధ్రాలో రాజన్నరాజ్యం లేదనా...? తన అన్నను కాంగ్రెస్ పెద్దలు జైల్లో పెట్టినప్పుడు ఆమె అన్నకు అండగా నిలిచింది. అన్నకంటే ముందు తాను 14 జిల్లాలలో 3000 కిలోమీటర్లు పాదయాత్ర చేసింది. బై బై బాబు... బై బై పప్పు అంటూ 2019 ఎన్నికలలో కూడా అన్న జెండాను అజెండాను తన భుజంపై మోసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన పక్క రోజునుండీ కనుమరుగైపోయింది. ఆమెకి ఆమె పార్టీకి, ప్రభుత్వానికీ దూరంగా ఉందా... లేక దూరంగా పెట్టారా? అన్న అనుమానం అందరిలోనూ కలిగింది.

అయితే ఇప్పుడు ఒక్క సారిగా ఆమె గళం విప్పింది. ఇక్కడ అన్న ముఖ్యమంత్రి అయిన 21 నెలల తరువాత అక్కడ తెలంగాణలో ఆమె ప్రకటన చేసింది. రాజన్న రాజ్యం తెస్తానంటూ తన మనోగతాన్ని బయటపెట్టింది. తనను ఆంధ్రా ఆడపడుచుగా కాకుండా తెలంగాణ కోడలుగా చూడాలంటూ అభ్యర్థిస్తోంది. జన నాయకుడి వారసురాలిగా, తెలంగాణ కోడలుగా తనను ఆదరించాలంటూ విన్నవించుకుంటోంది. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ పెట్టడానికి వేగంగా పావులు కదుపుతోంది. మే14, లేదా జులై 8న ముహూర్తం పెట్టబోతోంది.

అయితే షర్మిలకి, జగన్‌మోహన్‌రెడ్డికి మధ్య భిన్నాభిప్రాయాలే తప్ప బేధాభిప్రాయాలు లేవని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించినప్పటికీ, ఈ విషయంలో ఎవరూ స్పష్టత ఇవ్వలేకున్నారు. అన్నకు అండగా నిలచిన చెల్లెలు, ఇప్పుడు అన్న అభిప్రాయానికి వ్యతిరేకంగా ఎందుకు నిర్ణయం తీసుకుందో చెప్పలేకున్నారు. భిన్నాభిప్రాయాలు ఎందుకు వచ్చాయో స్పష్టత ఇవ్వలేకున్నారు.

## ఆందోళనలో వైయస్ అభిమానులు

రాజశేఖరరెడ్డితో ప్రత్యక్షంగా, ఆయన కుటుంబంతో పరోక్షంగా, సంబంధాలున్న వై.యస్ కుటుంబ అభిమానులు ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. ఇది కేవలం రాజకీయ పరిణామంగానే ముగిసిపోవాలని వాళ్ళు ప్రార్థిస్తున్నారు. కొంతమంది అనుమానిస్తున్నట్లుగా ఇది కుటుంబ వైరం కాకూడదని కూడా వాళ్ళు కోరుకుంటున్నారు. రారాజులా తన ప్రస్థానాన్ని కొనసాగించిన ధీశాలి డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రతిష్ట ఈ సంఘటనల కారణంగా ఎక్కడా దిగజారకూడదని వాళ్ళు ఆకాంక్షిస్తున్నారు. అన్నా, చెల్లీ కలసి అనుమానాలకు, అపోహలకు అడ్డుకట్ట వేయాలని అభిలషిస్తున్నారు.

## షర్మిల ఇంటికి క్యూ కడుతున్న నేతలు... ప్రముఖులు

ఇప్పుడు లోటస్‌పాండ్‌లోని షర్మిలమ్మ ఇంటికి తెలంగాణ నేతలు, ప్రముఖులు క్యూ కడుతున్నారు. అటు తెలంగాణ రాష్ట్ర సమితిలోకి వెళ్లలేక, ఎత్తిపోయే కాంగ్రెస్‌లో ఉండలేక, మతతత్వ బిజెపిని నమ్మలేక సందిగ్ధంలో ఉన్న నాయకులూ, కార్యకర్తలంతా షర్మిల పార్టీ వైపు చూస్తున్నారు. కొత్త నాయకత్వంపై కోటి ఆశలతో లోటస్ పాండ్ వైపు చూస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న కుటుంబం నుండి వస్తున్న మరో నాయకురాలికి హారతులు పట్టి స్వాగతం చెప్పడానికి సిద్ధమవుతున్నారు.

# పబ్లిక్ పర్సెప్షన్... కొంపలు ముంచుతుంది

సగం వరకు నిండి ఉన్న గ్లాసును చూస్తూ– సగం నిండి ఉందని ఒకరు అంటే....సగం గ్లాసు ఖాళీయే కదా అని మరొకరు అంటుంటారు. అంటే– గ్లాసు ఒక్కటే గానీ, ఎవరి అభిప్రాయం వారిది. దీనినే– 'పర్సెప్షన్' అని అంటుంటాం. ఏ విషయం మీదనైనా....సంఘటన మీదనైనా మనకు ఇన్‌స్టెంట్‌గా ఒక అభిప్రాయం కలుగుతుంది. దాని ఆధారంగానే, మనం నిర్ణయాలు తీసుకుంటూ ఉంటాం.

రాజకీయాల్లో అయితే....ఈ 'పబ్లిక్ పర్సెప్షన్' ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. తీవ్రంగా కూడా ఉంటుంది. రాజకీయ పార్టీల తలరాతలను మార్చడానికి కూడా ఈ పర్సెప్షనే ప్రధాన కారణం.

గతంలో 'మీడియా విస్పోటనం' లేని రోజుల్లో– ప్రభుత్వ పనితీరుపైన, రాజకీయపార్టీల వ్యవహారశైలిపైన ఒక అభిప్రాయం ఏర్పరుచుకోడానికి –ప్రజలకు చాలా సమయం పట్టేది. మరుసటి రోజు పత్రికల్లో వచ్చేవరకు, ఏ విషయమూ ప్రజలకు తొందరగా తెలిసేది కాదు. అందువల్ల కూడా, కాంగ్రెస్ పార్టీ అంతకాలం బతుకుతూ వచ్చింది. నాయకులు కూడా ప్రజాభిప్రాయాన్ని పెద్దగా లెక్కచేసేవారు కాదు.



కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. సమాచార విప్లవం సమాజాన్ని ముంచెత్తుతోంది. ఇంత కాలమూ సమాచారాన్ని అందిస్తూ వచ్చే మీడియా సంస్థల డ్రైవింగ్‌సీట్లో 'స్మార్ట్‌ఫోన్' వచ్చి కూర్చుంది. స్మార్ట్‌ఫోన్ చేతిలో ఉన్న ప్రతిఒక్కరూ సమాచార సృష్టికర్తే, సమాచార పంపిణీదారే.




ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, యూట్యూబ్ జీవితమైపోయిన ఈ రోజుల్లో– ఏ చిన్న సంఘటన అయినా క్షణాలలో దేశం (రాష్ట్రం కాదు) అంతా పాకిపోతున్నది. ఆ ఘటనపై జనం స్పందన కూడా అంతే వేగంగా విస్తరించేస్తున్నది. ఈ జనస్పందనే 'పబ్లిక్ పర్సెప్షన్'.

దీనికితోడు, జనంలో అక్షరాస్యత పెరిగింది. ఫలితంగా చైతన్యం పెరిగింది. రాజకీయ అవగాహన కూడా పెరిగింది. అయినప్పటికీ, జాగ్రత్తగా వ్యవహరించకపోతే, జనం కర్రు కాల్చి వాతలు పెడతారనే స్పృహ రాజకీయపార్టీలకు ఉన్నట్టు కనపడదం లేదు.

ఆ స్పృహ ఉండి ఉన్నట్లయితే... చంద్రబాబునాయుడుకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 23 సీట్లు మాత్రమే వచ్చి ఉండేవి కావు. తాను ఏమి చెప్పినా జనం నమ్మేస్తారని ఆయన భావించారు. కానీ, శిశుపాలుడి తప్పులను శ్రీకృష్ణుడు లెక్కేసినట్టు.. చంద్రబాబు ప్రవచనాలను, నిర్వాకాలను జనం లెక్క వేసుకుంటూ వచ్చారు. అలా లెక్క వేయడమే, 'పబ్లిక్ పర్సెప్షన్'

ఈ పర్సెప్షన్ ఏర్పడడానికి–నిజమే ప్రాతిపదిక కానక్కరలేదు. అపోహ, భ్రాంతి కూడా ప్రాతిపదిక కావచ్చు. తమ పర్సెప్షన్‌కు ఓ అపోహ, భ్రాంతి కారణమైందని తెలుసుకునే సరికి, చేతులు పూర్తిగా కాలిపోయి ఉండవచ్చు. జరిగిన నష్టం సరిదిద్దుకోలేనిది అయివుండవచ్చు.

రాజకీయపార్టీలకు అంకితమైపోయి ఉండే ఓటర్ల 'పర్సెప్షన్'కు పెద్ద విలువ ఉండదు. ఆయా పార్టీల తప్పొప్పులతో సంబంధం లేకుండా, వీరు ఆయా పార్టీలనే అంటిపెట్టుకుని ఉంటారు. ఉదాహరణకు– వైసీపీ, టీడీపీలను తీసుకుందాం.

రెడ్డి, ముస్లిం, క్రిస్టియన్ ఓటర్లలో అత్యధిక భాగం వైసీపీ మద్దతుదారులు అనే అభిప్రాయం ఒకటి ఉంది. అలాగే కమ్మ, బీసీ, బ్రాహ్మణ, వైశ్య, కాపు వగైరాలలో అధికులు టీడీపీ వెంట నడుస్తున్నారనే భావం 2014 ఎన్నికల అనంతరం వ్యక్తమైంది.

ఈ రెండు పార్టీలకు చెందని వారు– ఓటర్లలో కనీసం 10 శాతం మంది ఉంటారు. వీరే ఎన్నికల ఫలితాన్ని నిర్ధేశిస్తారు. అందువల్ల వీరి పర్సెప్షనే అత్యంత ప్రధానం.

ఈ సెక్షన్ ఓటర్లను ప్రభావితం చేయడం కోసమే – తెలుగుదేశం అధినేత ఆపసోపాలు పడుతున్నారు. రోజువారీ ప్రెస్ మీట్లు, స్టేట్మెంట్లు, ట్వీట్లు, వగైరాలు అన్నీ–ఆ పది శాతం ఓటర్ల పర్సెప్షన్‌ను ప్రభావితం చేయడానికేనన్న విషయాన్ని జగన్ ప్రభుత్వం గమనించిందో.. లేదో తెలియడం లేదు.

సాక్షాత్తు ముఖ్యమంత్రి నుంచి.. మంత్రులు, ఎం.ఎల్.ఏలు, అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలు, చివరికి– తమ తమ ఊళ్లల్లో ఉండే ఎస్.ఐ.ల వరకూ – అందరి మాటలనూ, చేతలనూ జనం నిత్యం గమనిస్తూ ఉంటారు. ఆయా ఘటనలపై మంచో... చెడో... ఒక అభిప్రాయాన్ని ఏర్పరుచుకుంటూ ఉంటారు.

అందుకే– తమ పాలనపై, వ్యవహార శైలిపై, తమ నాయకుల తీరు తెన్నులపై జన బాహుళ్యంలో ఎటువంటి ప్రతిస్పందన వ్యక్తం అవుతూ ఉన్నదనే విషయాన్ని అధికారంలో ఉన్నవారు గమనించుకుంటూ ఉండాలి. లేకపోతే, పుట్టి మునగడం ఖాయం. ఇందుకు కూడా చంద్రబాబునే ఉదాహరణగా తీసుకోవచ్చు.

గత ఎన్నికల సందర్భంగా కనీసం 70మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చాలని ఆయనకు చెప్పవలసిన వారు చెప్పారు. ఆయన ఒక్క సిట్టింగ్‌ను కూడా తనకు తానుగా మార్చలేదు. "175 స్థానాలలోనూ నేనే పోటీ చేస్తున్నాను అనుకుని ఓటు వేయండి." అంటూ ఓటర్లకు ఆయన పిలుపు ఇచ్చారు. చివరకు 23 చేతిలో పెట్టారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 85 శాతం సీట్లు దక్కించుకున్న వైసీపీ జోరు తగ్గిందనే భావం వ్యాపింపచేయడానికి టీడీపీ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నది. మీడియాలో రకరకాల కథనాలు, డిబేట్లు, శాపనార్థాలు విశృంఖల విహారం చేస్తున్నాయి. 'మార్పు మొదలైంది....' అంటూ టపాకాయలు పేలుస్తున్నారు. మిఠాయిలు పంచుతున్నారు. ఆలింగనాలూ చేసుకుంటున్నారు. ఇదంతా ...తమకు ఇప్పటికిప్పుడు ఏదో జరిగిపోయిందని కాదు. పబ్లిక్ పర్సెప్షన్‌ను మాన్యుఫ్యాక్చర్ చేసే బృహత్తర కార్యక్రమంలో భాగంగానే చేస్తున్నారు.

దీనిని గమనించి, నియంత్రించి, నిరోధించే యంత్రాంగం జగన్ ప్రభుత్వానికి ఉండాలి. ఉన్నదా మరి?

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# బాగా తగ్గిన కరోనా కేసులు

జిల్లాలో కరోనా క్రమేణా తగ్గుతూవస్తోంది. ఈనెల 16న మొత్తం 2,273 మందికి కోవిడ్ పరీక్షలు చేయించగా వారిలో ముగ్గురికి మాత్రమే కోవిడ్ నిర్ధారణ అయింది. వీరిని హోం ఐసోలేషన్లో ఉంచి వైద్యులు చికిత్సలందిస్తున్నారు. కరోనాతో ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్న నలుగురు కోలుకోవడంతో వారిని డిశ్చార్జ్ చేశారు. కాగా జిల్లాలో ఇప్పటిదాకా 63,974 కరోనా కేసులు నమోదు కాగా, అందులో 63,331 మంది కోలుకొని ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ వ్యాధి బారిన పడి 589 మంది మృతిచెందారు. మిగిలిన 54 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

### 1458 మందికి వ్యాక్సిన్ :

కరోనా వ్యాధి నివారణకు ఇస్తున్న వ్యాక్సిన్‌లో భాగంగా జిల్లాలో 1458 మంది మునిసిపల్ సిబ్బందికి, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బందికి రెండవ దశ టీకాలు వేశారు. దీంతోపాటు తొలి డోస్ టీకా వేసుకున్న సిబ్బందికి రెండవ డోస్ టీకా వేస్తున్నారు. మొత్తం 65 సెషన్లలో 325మంది వైద్య సిబ్బంది పాల్గొని టీకా వేశారని, టీకా వేసుకున్నవారు 28 రోజుల తర్వాత రెండవ డోస్‌ను తప్పకుండా వేసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి రాజ్యలక్ష్మి తెలియజేశారు.

### ముగ్గురికి కోవిడ్.. నలుగురు డిశ్చార్జ్

### 25 దాకా..తొలిదశ టీకా :

ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని రకాల క్యాడర్ల వారికి సంబంధించిన హెల్త్‌వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కోవిడ్ టీకా తొలి డోస్ వేసే గడువు ఈనెల 25వ తేదితో ముగుస్తుందని, తొలిదశలో పేర్లు నమోదు చేయించుకున్నవారిలో అనేకమంది ఇంకా టీకా వేయించుకోలేదని, వీరికి 25వ తేది దాకా చివరి అవకాశం కల్పిస్తున్నామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఈనెల 17న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండవ దశకు సంబంధించిన మునిసిపల్, రెవెన్యూ, పంచాయతి సిబ్బందికి టీకా కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని ఆమె తెలియజేశారు.

# బాడీబిల్డింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. నెల్లూరులోని రంగనాయకుల పేటలో ఉన్న పినాకిని పార్క్, హనుమాన్ వ్యాయామశాలలో ఇటీవల ఆ జట్ల ఎంపికలు జరిగాయి. 55 కేజీల విభాగంలో ఎస్ అబిద్, టిడి ఏసు, 60 కేజీల విభాగంలో ఎ.అవిజిత్, ఎం.డి.యాకూబ్, 65 కేజీల విభాగంలో టి.హరికృష్ణ, 75కేజీల విభాగంలో టి.రామకృష్ణ, 85కేజీల విభాగంలో జె.అఖిల్ ఎంపికైనట్లు జిల్లా అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కోశాధికారి డి.ప్రకాష్ తెలియజేశారు.

# 'విలువిద్య'లో సత్తా చాటారు

- పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు
- డెహ్రాడూన్‌లో జాతీయస్థాయి పోటీలకు సిద్ధం

విలువిద్యలో కూడా జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటుతూ ముందుకు దూసుకుపోతున్నారు. ఈనెల 16న విజయ వాడలో జరిగిన రాష్ట్రస్థాయి విలువిద్య (ఆర్చరీ) పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభాపాటవాలు ప్రదర్శించి పతకాలు సాధించారు. సబ్‌జూనియర్స్ బాలికల విభాగంలో రికర్వ్ రౌండ్‌లో ఏ.వినుతి బంగారు పతకం సాధించి అందరి ప్రశంసలు అందుకోగా, కె.ప్రియ వెండి పతకం, వి.సుమ కాంశ్య పతకం సాధించి అందరి అభినందనలు అందుకున్నారు.. అదేవిధంగా బాలుర సబ్ జూనియర్స్ విభాగంలో ఆర్.సాయిమౌర్య వెండిపతకం సాధించగా, జూనియర్ బాలుర విభాగం రికర్వ్ రౌండ్‌లో ఆర్.సాయిమౌర్య కాంశ్య పతకం సాధించి అందరి ప్రశంసలు పొందారు. వీరంతా మార్చి 7 నుంచి 15వ తేది వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీహర్ష, వేణు తెలియజేశారు.

### సేవాభావం చాటుకున్న

# 'విశ్వోదయ' పూర్వ విద్యార్థులు

### 102మంది పేదలకు ఆహారపొట్లాలు

కావలి పట్టణంలోని విశ్వోదయ పాఠశాల పూర్వ విద్యార్థులు, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 17న బుడమగుంట గిరిజన కాలనీలో ఉన్న 102 మంది పేదలకు భోజనం పొట్లాలు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. 'హంగ్రీ ఛాలెంజ్' పేరుతో ప్రతి రోజూ ఒకరి ఆకలి తీర్చడమే లక్ష్యంగా తమ సేవాసంస్థ పనిచేస్తోందని, ఈనెల 17నాటికి వంద రోజుల్లో 1896 మంది పేదలకు ఆహారపొట్లాలు అందించడం తమకెంతో సంతోషంగా ఉందని సురేంద్ర పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రెడ్డెప్ప, మూర్తి తదితరులతోపాటు పూర్వవిద్యార్థులు టి.జి బ్రహ్మయ్య, ఎస్‌కె సుభాని, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### 'ఆదిశంకరాచార్య భవన్'కు

# శంకుస్థాపన



నెల్లూరులోని ప్రసిద్ధమైన శంకరమఠంలో ఏర్పాటు చేయనున్న 'ఆదిశంకరాచార్య భవన్' నిర్మాణానికి ఈనెల 17న శంకుస్థాపన జరిగింది. మఠం నిర్వాహకులు నందకిషోర్, ఉషాకుమారి దంపతులు ఈ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

---

వీక్షణం - మంజీర

### ఒక ప్రకటన..

# వంద ప్రశ్నలు!



ఆమె ఒక మాజీ ముఖ్యమంత్రి గారాల పట్టి. ఒక ముఖ్యమంత్రికి అనురాగాల చెల్లి. పాదయాత్రలో నాన్న కాళ్లు బొబ్బలెక్కుతున్నాయని తెలిసి విలవిల్లాడింది. హైదరాబాద్ నుంచి నడకకు అనువైన మంచి షూస్ జత తీసుకెళ్లి పాదయాత్రలో ఉన్న నాన్నకు ఇచ్చింది. కాలం గడిచింది. నాన్న ముఖ్యమంత్రి అయ్యారు. జనం గుండెల్లో గుడికట్టుకున్నారు. అంతే వేగంగా కాలం కూడా చేశారు. కాలం గడిచిపోతూనే ఉంది. తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని అన్న రాజకీయరంగ ప్రవేశం చేశాడు. కాలం కలిసి రాలేదు. అన్న మొదలు పెట్టిన రాజకీయ ప్రస్థానం ప్రశ్నార్థకంలో పడింది. అప్పుడు మళ్లీ వచ్చిందామె. 'మీ దగ్గరకు అన్న రాలేకపోయాడు. అన్న వదిలిన బాణాన్ని నేనొచ్చాను. మీ రాజన్న బిడ్డనొచ్చాను' అంటూ అడుగు ముందుకేసింది. జనం నీరాజనాలు పట్టారు. తమ ఇంటి బిడ్డ వచ్చినంతగా సంతోషపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి మీద పెంచుకున్న మమకారాన్ని రాజన్న బిడ్డ మీద కురిపించారు. అదే రాజన్న బిడ్డ ఇప్పుడు మళ్లీ వస్తోంది. ఆమెకు స్వాగతం పలకడానికి తెలంగాణ రాష్ట్రం సిద్ధంగా ఉంది. ఆమె రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఇంకా ప్రకటన చేయలేదు. కేవలం ప్రజల్లోకి వెళ్తున్నట్లు మాత్రమే ప్రకటించింది. ఆ ప్రకటనకే వంద ప్రశ్నలు మొలకెత్తాయి. ఆమె ఎవరి బాణం అనే సందేహంతో నేతల భృకుటులు ముడివడ్డాయి. ఈసారి ఆమె ఎవరిచేతిలోనో బాణంగా రావడం లేదు. ఆమె స్వయంగా తనకు తానే బాణాన్ని సంధిస్తోంది. తెలంగాణ రాజకీయ యవనిక మీద కొత్త చిత్రాన్ని ఆవిష్కరించబోతోంది.

### కొత్త నావ

వైఎస్ షర్మిల... ఈ పేరు ఇప్పుడు తెలంగాణ రాజకీయ పార్టీల్లో వణుకు పుట్టిస్తున్న పేరు. 'ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి ఆమె అవసరం ఉందా' అనే వాళ్లొకరు, 'ఆమె మా బాణం కాదు' అని స్పష్టం చేసేవాళ్లొకరు, 'ఆమె రాజకీయ ప్రవేశం ఫలానా పార్టీ ప్రయోజనం కోసమే' అని మరొకరు... ఎవరికి వాళ్లు ఆమెకు సమదూరాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే... ఏ ప్రకటనా చేయకుండా 'ఆమె ప్రకటన' కోసం ఎదురు చూస్తున్న నేతలు ఎందరో ఉన్నారు. 'నడి సంద్రమున నా నావ. నడిపించు దేవా' అన్నట్లుంది కాంగ్రెస్ పార్టీ పరిస్థితి. ఈ నావ ఒడ్డు చేరుస్తుందనే నమ్మకం సడలిన నాయకులే ఆ పార్టీలో ఇప్పుడు. చిల్లులు పడిన నావకు అతుకులు వేసే ఓపిక కూడా చాలామందిలో నశించిపోయింది. వాళ్లంతా తమ పార్టీ డీఎన్‌ఏను పోలిన కొత్త నావ సిద్ధమవుతోందని ఆశగా చూస్తున్నారు. తమ వారసత్వాన్ని ఈ కొత్త నావలో ప్రవేశపెట్టి నిశ్చింతగా గుండెల మీద చెయ్యి వేసుకుని శేష జీవితాన్ని గడిపేయాలనే ఆలోచనలో ఉన్న వృద్ధతరానికి షర్మిల ఒక ఆశాకిరణం. తన తండ్రితో కలిసి పనిచేసిన కుటుంబాలను దగ్గర చేసుకోవడం షర్మిలకు ఇప్పుడు రాజకీయ అవసరం. ఆ అవసరాన్ని ఆమె సమర్థవంతంగా నిర్వహిస్తున్నారనే చెప్పాలి. 'నన్ను మేడమ్ అని పిలవడం ఏంటన్నా! నాన్నతో కలిసి పనిచేసినవాళ్లు మీరంతా. నన్ను పేరుతో పిలవండి లేదా చెల్లీ అనండి' అన్న ఒక్కమాట వైఎస్ఆర్‌తో అనుబంధం కలిగిన కాంగ్రెస్ నాయకుల మనసులను తాకుతోంది.

### సింధియా ఒక రాష్ట్రంలో రాజె... మరో రాష్ట్రంలో

'అన్నతో విభేదాలుంటే ఏపీలో పార్టీ పెట్టుకోవాలి కానీ తెలంగాణలో పార్టీ పెట్టడం ఏంటీ' అనే సన్నాయి నొక్కులు బాగానే వినిపిస్తున్నాయి. కానీ షర్మిల రాజకీయ చిత్రానికి తెలంగాణలో కొబ్బరికాయ కొట్టడం నూటికి నూరుపాళ్లూ కరెక్టే. ఆమె ఏదో ఒక పార్టీలో ఉండి అందులో నుంచి చీలిక తేవడం లేదు. ఒకరు స్థాపించిన పార్టీ పగ్గాలను వారసత్వ హోదాతో అందుకుని నడిపించడం కూడా కాదు. తనకు తానుగా ఒక పార్టీ పెడుతున్నారు. ఆమె రాయలసీమ ఆడపడుచు నిజమే, తెలంగాణ కోడలు కూడా. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి తెలంగాణకు వచ్చి స్థిరపడిన కుటుంబం ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమం చేసే పేటెంట్ సొంతం చేసుకోగలిగినప్పుడు... తెలంగాణ కోడలు తెలంగాణ రాష్ట్రంలో పార్టీ పెట్టడంలో వింత, విచిత్రం ఏముంటుంది? మాధవరావు సింధియా ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో చక్రం తిప్పాడు, ఆయన సోదరి వసుంధర రాజె రాజస్థాన్ రాజకీయాల్లో కీలకం అయ్యారు. బీజేపీ ఎందుకో కానీ షర్మిల విషయంలో ఈ లాజిక్‌ని మిస్సవుతోంది. బహుశా... రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో పాగా వేయాలన్న ఆ పార్టీ ఆశలకు షర్మిల భారీగా గండి కొట్టే ప్రమాదం ఉండడమే కావచ్చు.

### ఇలా కలిసొస్తోంది

తెలుగు రాష్ట్రాలు రెండుగా చీలిపోవడం వైఎస్ఆర్ బిడ్డలకు ఈ రకంగా కలిసి వస్తున్నట్లుంది. అయితే ఆమె తెలంగాణని రాజకీయ వేదికగా చేసుకోవడం మాత్రమే కాదు, తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే ప్రయత్నం కూడా చేయాలి. తెలంగాణ ప్రజల మనోభావాలను కాపాడగలగాలి. ఆ ప్రయత్నం ఆమె చేతల్లో కనిపించి తీరాలి. ఈ సమయంలో ఆమె చుట్టూ ఉన్న సలహాదారులెవరనేది కూడా ముఖ్యమే. ఈ విషయంలో ఆమె ఇప్పటికే చాలా తూకంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం పనిచేసిన మేధావులు... బంగారు తెలంగాణ సాధనలో కేసీఆర్ విఫలమయ్యాడనే ఆవేదనలో ఉన్నవాళ్లు... తాము కోరుకున్న సామాజిక తెలంగాణా సాధన కోసం షర్మిల సలహాదారులుగా మారుతున్నారు. ఆమె చుట్టూ ఆంధ్ర, రాయలసీమ వాళ్లు మాత్రమే ఉంటే ఎదురయ్యే ప్రమాదం ఏమిటో ఆమె గ్రహించినట్లే ఉన్నారు. ఆ మేరకు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లే ఉన్నారు. షర్మిల రాబోయే ఎన్నికలకు సిద్ధం అవుతారనడంలో సందేహం లేదు. ఆమెకు కలిసి వచ్చే అంశాలు చాలానే ఉన్నాయి. కానీ వైఎస్ఆర్ ప్రత్యేక తెలంగాణకు వ్యతిరేకి, ఆయన సమైక్యవాది అనే ముద్ర మాత్రం ఎప్పటికీ చెరిగిపోదు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ పాలన పట్ల క్షేత్రస్థాయి తెలంగాణ ప్రజల్లో విపరీతమైన 'మంచిపేరు' ఉంది. రాష్ట్రం ఒకటిగా ఉండి ఉంటే జగన్ పాలన ఫలాలను తాము కూడా అందుకునే వాళ్లమనే భావన కూడా అంతే స్థాయిలో ఉంది. వైఎస్ బిడ్డను ఆదరిస్తే... ఏపీలో జగన్ అందించినట్లే తెలంగాణలో షర్మిల కూడా సంక్షేమ ఫలాలను తారస్థాయిలో అందిస్తారనే అభిలాష కూడా తెలంగాణ ప్రజల్లో కలుగుతోంది. ఎటొచ్చీ ఆమెను అడ్డుకునే ప్రయత్నం చేసే వాళ్లందరూ ప్రత్యర్థి పార్టీల నాయకులు మాత్రమే. నియోజకవర్గ స్థాయి నాయకులలో కానీ, ఓట్లేసే ప్రజల్లో కానీ ఆమె రాకను నిలువరించాలనే ఆలోచన లేదు. వారంతా స్వాగతించడానికే సిద్ధంగా ఉన్నారు. తెలంగాణలో పార్టీ పెట్టాలనే ఆమె ఆలోచన హుందా అయిన రాజకీయ నిర్ణయమే.

# టిటిడి ఆధ్వర్యంలో..త్వరలోనే 'కల్యాణమస్తు'

## బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి వెల్లడి



నెల్లూరులో జరిగిన 'శ్రీ పంచమి' వేడుకల్లో గోమాతకు పూజలు చేస్తున్న వై.వి.సుబ్బారెడ్డి దంపతులు

తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో త్వరలోనే దేశవ్యాప్తంగా 'కల్యాణమస్తు' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. నిరుపేద కుటుంబాలవారు తమ బిడ్డల పెళ్ళిళ్లు చేయడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదన్న సంకల్పంతో 'కల్యాణమస్తు' కార్యక్రమం ద్వారా సామూహిక వివాహాలు చేసేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ఈనెల 16న ఆయన నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో 'గుడికో గోమాత' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టిటిడి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఎన్నో హైందవ ధార్మిక కార్యక్రమాలు చేపట్టేందుకు సంకల్పించామన్నారు. కల్యాణమస్తు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రతిజిల్లాతో పాటు దేశంలోని అనేక ముఖ్య నగరాలు, పట్టణాల్లో ఉచితంగా వివాహాలు చేస్తామన్నారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో బిసి, ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో అయిదువందల ఆలయాలను కూడా నిర్మించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పించారని, కోవిడ్ కారణంగా ఆ పనులు ఆలస్యమయ్యాయని, త్వరలోనే ఈ ఆలయాల నిర్మాణాలను కూడా ప్రారంభించనున్నామని తెలియజేశారు. తొలుత టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అయిదు ఆలయాలకు దానంగా ఇచ్చిన గోవులకు, దూడలకు పూజలు చేశారు. ఆ తర్వాత టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి చేతులమీదుగా ఆ గోవులను ఆలయాలకు అప్పగించారు. రాజ్యసభ సభ్యులు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మూడు ముహూర్తాలు సిద్ధం

'కల్యాణమస్తు' కార్యక్రమాన్ని టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి నెల్లూరులో ప్రకటించిన వెంటనే ఆ వివాహాలను ఎప్పుడు నిర్ణయిస్తే బావుంటుందో టిటిడి ఇ.ఓ జవహర్‌రెడ్డి తిరుమలలో పండిత మండలితో సమావేశమై మూడు ముహూర్తాలను నిర్ణయించారు. వారు అందజేసిన లగ్నపత్రికను తొలుత శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలుచేశారు. కల్యాణమస్తు వివాహాలకు మే 28వ తేది మధ్యాహ్నం 12.34 నుంచి 12.40 నిమిషాల మధ్య మొదటి ముహూర్తంగా పండితులు నిర్ణయించినట్లు జవహర్‌రెడ్డి తిరుమలలో ఈనెల 17న వెల్లడించారు. అదేవిధంగా రెండవ ముహూర్తం అక్టోబర్ 30వ తేది ఉదయం 11-04 నుంచి 11-08 నిమిషాల మధ్య, మూడవ ముహూర్తం నవంబరు 17వ తేది ఉదయం 9-56 నుంచి 10-02 నిమిషాల మధ్య ఆ వివాహాలకు శుభముహూర్తాలను పండితులు నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.

### జొన్నవాడ కామాక్షమ్మ సేవలో టిటిడి బోర్డు ఛైర్మెన్ సతీమణి

టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలతారెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సతీమణి.. టిటిడి బోర్డు పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఇరువురు ఈనెల 17న జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Managing Editor : **T.BHARATHI REDDY**, Sub-Editor : **MADDURU SRINIVASULU**. e-mail: lawyerpatrika@gmail.com